Bhavani Publication Trust
https://prajatheerpudaily.com

# ప్రజాతీర్పు
The people's Verdict
తెలుగు జాతీయ దినపత్రిక

రిపోర్టర్లు కావలెను
అధునాతన సాంకేతికతతో..
ఎప్పటి వార్తలు అప్పుడు అందించేందేందుకు
మీ ముందుకు వచ్చిన
ప్రజా టెలివిజన్
యూట్యూబ్ చానల్‌లో పని చేయుటకు
రిపోర్టర్లు కావలెను. ఎలాంటి టార్గెట్లు ఉండవు.
నిత్యనూతనంగా వార్తలు, లైవ్‌లు అందించడమే మీ పని..
సంప్రదించండి: 8309979541, 9494659622
మా యూట్యూబ్ చానల్‌ను సపోర్ట్ చేయండి
8309979541
ప్రజా టెలివిజన్
తాజా వార్తలు, అప్‌డేట్, లైవ్ ప్రోగ్రామ్‌ల కోసం లైక్, షేర్, సబ్‌స్క్రైబ్

సంపుటి : 26 | సంచిక : 160 | హైదరాబాద్ | ఆదివారం 03 మే 2026 | పేజీలు : 8 | వెల : రూ. 1/-
Cerculated From : KARIMNGAR, HYDERABAD, WARAGAL, RANGAREDDY, MAHABOOBNAGAR, THIRUPATI, GUNTUR, KURNOOL, ANATAPUR, VISAKAPATNAM, CHENNAI, BANGALOOOR






## బోధనాంశంగా 'మోదీ తత్వం'

### మహారాజా సయాజీరావ్ వర్సిటీలో కొత్త కోర్సులు

### ఆర్‌ఎస్‌ఎస్, హిందూయిజం పైనా పాఠాలు

వడోదర: గుజరాత్‌లోని బరోడాలో ఉన్న మహారాజా సయాజీరావ్ విశ్వవిద్యాలయంలో బీజేపీ అగ్రనేత, ప్రధాని నరేంద్ర మోదీ పరిపాలనా దక్షతను కీర్తిస్తూ కొత్త బోధనాంశాలను చేర్చారు. జూన్‌తో మొదలయ్యే నూతన విద్యా సంవత్సరంలో బీఏ సోషియాలజీ నాలుగేళ్ల కోర్సును ఆరంభించనున్నారు. ఇందులో నాలుగో ఏడాది పది పేపర్లలో మోదీ నాయకత్వ ప్రతిభ, దేశీయ నాలెడ్జ్ సిస్టమ్, హిందూ రిలీజియస్ స్టడీస్, జాతీయవాదం వంటి పాఠాలను చేర్చారు. రెండేళ్ల సోషియాలజీ పీజీ కోర్సులోనూ ఈ సబ్జెక్టులను పాఠాలుగా బోధించనున్నారు. మాస్టర్స్ కోర్సులో 'సోషియాలజీ ఆఫ్ ప్యాట్రియాటిజం'కోర్సులో మోదీతత్వాన్ని విద్యార్థులు బోధించనున్నారు. పలువురు సంఘ సంస్కర్తలు,

- మిగతా 2వ పేజీలో



## సముద్రంలో సమున్నతంగా..

### సముద్రజలాల అడుగున అతిపెద్ద త్రివర్ణపతాకం

### కొత్త గిన్నిస్ ప్రపంచ రికార్డ్ నమోదు

శ్రీ విజయపురం: త్రివర్ణపతాకంపై అభిమానం ఎంతటి అనితర సాధ్యమైన కార్యాన్నయినా సుసాధ్యంచేయిస్తుంది. భారత జాతీయజెండా గురించి యావత్ ప్రపంచం మరోసారి చర్చించుకునేలా చేశారు పలువురు సాహసికులు. పోలీసులు, సైన్యం, నావికాదళం, తీరగస్తీదళం, గజ ఈతగాళ్లుసహా పలువురి సమష్టి కృషి ఏకంగా నూతన గిన్నిస్ ప్రపంచరికార్డ్‌ను బద్దలుకొట్టేలాచేసింది. ఇందుకు అండమాన్‌నికోబార్ దీవుల్లోని రాధానగర్ బీచ్ వేదికైంది. సముద్ర జలాల్లో అడుగున అతిపెద్ద జాతీయజెండాను ఆవిష్కరించి పలువురు కొత్త గిన్నిస్ రికార్డ్‌ను నెలకొల్పడం విశేషం. అండమాన్‌నికోబార్ పరిధిలోని స్వరాజ్ ద్వీప్(హ్యావ్‌లాక్ ఐలాండ్)లోని రాధానగర్ బీచ్‌లోకి 60 మీటర్ల పొడవు, 40 మీటర్ల వెడల్పున్న త్రివర్ణపతాకాన్ని తీసుకొచ్చారు. తర్వాత

- మిగతా 2వ పేజీలో



మంత్రివర్గ విస్తరణలో కీలక అంశం ఏమిటంటే ఉన్న మంత్రుల్లో ఇద్దరిని తప్పిస్తారని ప్రచారం జరుగుతోంది. పనితీరు సరిగ్గా లేని ఇద్దరు మంత్రులను స్థానంలో కొత్తవారిని తీసుకోవడంతో పాటు మరొకరి అవకాశం కల్పించనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది

# ఆ ముగ్గురు ఎవరు?

## ఆవిర్భావం నాటికి కొత్త మంత్రులు

### మంత్రివర్గ విస్తరణపై ముఖ్యమంత్రి రేవంత్ కసరత్తు

కోమటిరెడ్డి బ్రదర్స్‌లో ఉండేది ఎవరు?

ఎస్టీల నుంచి రామచంద్రునాయక్, బాలునాయక్

బీసీ కోటాలో వేములవాడ ఎమ్మెల్యే ఆది

రేసులో టీపీసీసీ చీఫ్.. స్పీకర్.. మరికొందరు..

టీపీసీసీ పదవుల భర్తీపైనా చర్చ

(ప్రజాతీర్పు ప్రతినిధి, హైదరాబాద్)

తెలంగాణ మంత్రివర్గం విస్తరణ అంశం మరోసారి చర్చకు వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు కావొస్తున్నా.. ఇంకా పూర్తిస్థాయి మంత్రివర్గం కొలువు దీరలేదు. కీలకమైన కొన్ని శాఖలు సీఎం రేవంత్‌రెడ్డి వద్దే ఉన్నాయి. పూర్తిస్థాయి మంత్రివర్గం కూడా ఏర్పాటు చేయలేని స్థితిలో కాంగ్రెస్ ఉందని బీఆర్‌ఎస్, బీజేపీలు విమర్శిస్తున్నాయి. ఇంకో ఏడాది పోతే వచ్చేది ఎన్నికల సంవత్సరమే. ఇప్పటి నుంచి ఎన్నికలకు సన్నద్ధం కావాల్సిందే. ఇలాంటి పరిస్థితుల్లో పూర్తిస్థాయి మంత్రివర్గ విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు మంత్రివర్గ విస్తరణ అంశం తెరపైకి వచ్చినా.. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి కొత్త మంత్రులకు చోటు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు.

### ఇద్దరు పాతవారు అవుట్..

ఈసారి మంత్రివర్గ విస్తరణలో కీలక అంశం ఏమిటంటే ఇప్పటికే ఉన్న మంత్రుల్లో ఇద్దరిని తప్పిస్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. పనితీరు సరిగ్గా లేని ఇద్దరు మంత్రులను పక్కన పెట్టి వారి స్థానంలో కొత్తవారిని తీసుకోవడంతో పాటు మరొకరి అవకాశం కల్పించనున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఇందుకోసం ప్రజలతో నేరుగా సంబంధం ఉండే కీలక శాఖల మంత్రుల పనితీరుపై ఇప్పటికే హైకమాండ్ నివేదికలు తెప్పించుకుంది. కొన్ని ప్రతిష్ఠాత్మక హామీల అమలులో వెనుకబడిన శాఖల బాధ్యతలను సమర్థులకు అప్పగించేలా భారీ మార్పులు

- మిగతా 2వ పేజీలో




## జీవో 7 తీసుకురావడం తగదు

### గతంలో లాగానే ఫీజ్ రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలి

### బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి టీ జీవన్ రెడ్డి

హైదరాబాద్, మే 2 : పేద విద్యార్థులకు అండగా ఉండేందుకు అమలు చేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో ప్రభుత్వం జీవో 7 తీసుకురావడం కరెక్ట్ కాదని బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి టి.జీవన్‌రెడ్డి మండిపడ్డారు. ఫీజ్ రీయింబర్స్‌మెంట్ నేరుగా కళాశాలలకు చెల్లించే స్తోమత లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దానికి సంబంధించిన ఆర్థిక భారం మీరే భరించాలని ప్రభుత్వం అంటున్నదని, అది ఎలా సాధ్యమవుతుందని ప్రశ్నించారు. కేసీఆర్ మీద కోపం ఉన్నట్టుతై ఈ పథకం ప్రారంభించింది వైఎస్సార్ అని, ఆయన కోసం అయిన కొనసాగించాలని సూచించారు. రేవంత్ రెడ్డికి నిరుపేద వర్గాలు అంటే ఎందుకు అంత కక్ష అని, రాజ్యంగా నిబంధనలు పాటించడం

- మిగతా 2వ పేజీలో

## కాంగ్రెస్‌కు మళ్లీ అధికారం కల్ల

రెండున్నరేళ్ల పాలనలో

అవినీతి అడ్డగోలుగా పెరిగింది

వాళ్ల స్కాంలను చూసి ప్రజలు

మరో 20 ఏళ్లు ఓటేయరు

కేంద్రం గ్యాస్ ధరలు

పెంచినందుకు నిరసనలు తెలపాలి

పార్టీ రంగారెడ్డి జిల్లా నేతలతో సమీక్షలో కేటీఆర్

రంగారెడ్డిజిల్లా: 'రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలనలో భూ కుంభకోణాలు, అరాచకాలు మినహా ప్రజలకు చేసిందేమీ లేదు. ఆ పార్టీ అరాచకాలు చూసి ప్రజలు తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారు. ప్రజలు వారికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఓటు వేసే అవకాశం లేదు. ఆ పార్టీ మరో 20 ఏళ్ల వరకు అధికారంలోకి రావడం కల్ల'అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 'రాష్ట్రంలో కాంగ్రెస్ అవినీతి అడ్డగోలుగా పెరిగిపోయింది. అన్ని అంశాల్లోనూ కాంగ్రెస్ పార్టీ

- మిగతా 2వ పేజీలో







# నేనున్నానని..

### ఓఆర్ఆర్ ప్రమాద బాధితులకు కేటీఆర్ నివాళి

### ఉస్మానియా మార్చురీ వద్ద కుటుంబ సభ్యులకు పరామర్శ

### సిరిసిల్లకు తరలిన ఆరుగురు మృతుల భౌతిక కాయాలు

(ప్రజాతీర్పు ప్రతినిధి, రంగారెడ్డి జిల్లా)

సిరిసిల్లలో తీవ్ర విషాదాన్ని నింపిన ఔటర్ రింగ్ రోడ్ రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలను బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ శనివారం ఉదయం పరామర్శించారు. నిన్న జరిగిన ఈ ఘోర ప్రమాదంలో సిరిసిల్లకు చెందిన ఆరుగురు వ్యక్తులు మృతి చెందడంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే శనివారం ఉదయం హైదరాబాద్‌లోని ఉస్మానియా జనరల్ హాస్పిటల్

- మిగతా 2వ పేజీలో



## మోదీ పర్యటన మోగిపోవాలె!

### ప్రధాని రాష్ట్ర పర్యటనకు బీజేపీ భారీ ఏర్పాట్లు..

సన్నాహక సమావేశాలతో జోష్

సన్నాహక సమావేశాలతో రాంచందర్‌రావు, కిషన్‌రెడ్డి బిజీ

హైదరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనను బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. మూడోసారి ప్రధాని అయ్యాక మొదటిసారి ఆయన ఈ నెల 10వ తేదీన తెలంగాణకు వస్తుండటంతో కనీవినీ

- మిగతా 2వ పేజీలో

## 100 రోజులు.. 6 వేల కోట్లు

### ఉద్యోగుల రిటైర్మెంట్ ప్రయోజనాల చెల్లింపులపై సీఎం స్పష్టీకరణ

జూన్ 1 కల్లా హెల్త్ కార్డులు అందిస్తాం

రెండో పీఆర్సీపై తక్షణమే నివేదిక అందించాలని కమిటీకి ఆదేశం

నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకుంటాం..

మాది స్నేహపూర్వక ప్రభుత్వం

సమస్యల పరిష్కార బాధ్యత ప్రభుత్వానిదే

టీఈజేఏసీ, ఎంప్లాయీస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ప్రతినిధుల సమావేశంలో సీఎం

-2లో

# నేనున్నానని..

(మొదటి పేజీ తరువాయి)

మార్చురీకి చేరుకున్న ఆయన, మృతుల పార్థివ దేహాల వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి ఘన నివాళులర్పించారు. అనంతరం, అక్కడ ఉన్న మృతుల కుటుంబ సభ్యులతో కేటీఆర్ మాట్లాడారు. ఆత్మీయులను కోల్పోయి కన్నీరు మున్నీరవుతున్న వారిని ఆయన ఓదార్చి, ధైర్యం చెప్పారు. ఈ కష్ట సమయంలో తాను వ్యక్తిగతంగా బాధిత కుటుంబాలకు పూర్తి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఒకే గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు ఇలా అకాల మరణం చెందడం తీరని లోటు అన్నారు. ఉస్మానియా ఆసుపత్రిలో పోస్టుమార్టం, ఇతర అధికారిక ప్రక్రియలు పూర్తయిన తర్వాత, ఆరుగురి మృతదేహాలను అంబులెన్స్‌లలో వారి స్వగ్రామమైన సిరిసిల్లకు తరలించారు. అంత్యక్రియల నిమిత్తం మృతదేహాలను తరలించే వరకు కేటీఆర్ గారు అక్కడే ఉండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ విషాద ఘటనతో అటు సిరిసిల్ల నియోజకవర్గంలోనూ, ఇటు ఉస్మానియా ఆసుపత్రి ప్రాంగణంలోనూ విషాద ఛాయలు అలముకున్నాయి.

## జీవో 7 తీసుకురావడం తగదు

(మొదటి పేజీ తరువాయి)

నీ బాధ్యత కాదా అని ప్రశ్నించారు. విద్యా, వైద్యం రాజ్యాంగంలో ప్రాథమిక హక్కు అని, వైద్యానికి సంబంధించి కూడా కేసీఆర్ ఆరోగ్య శ్రీని మరింత పటిష్టం చేశారని, తెలంగాణ ఏర్పాటు అయ్యాక 33 జిల్లాలు ఏర్పాటు చేసి అన్ని జిల్లాల్లో వైద్య విద్యా కాలేజ్‌లు ఏర్పాటు చేశారని జీవన్‌రెడ్డి గుర్తు చేశారు. టీమ్స్ హాస్పిటల్స్ ఏర్పాటు చేశారని, అవి అన్నీ త్వరలో అందుబాటులోకి రానున్నాయన్నారు. గతం కంటే మెరుగైన పాలన కొనసాగించాలి.. కాని రేవంత్ రెడ్డికి అది సాధ్యం కాదని ఎద్దేవా చేశారు. పేద విద్యార్థులకు ఇబ్బందికి కలిగించే జీవో 7ను వెంటనే ఉపసంహ రించుకోవాలని, గతంలో లాగానే ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేయాలని జీవన్‌రెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, కేసీఆర్ మళ్లీ సీఎం కాబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. 1994 సంవత్సరంలో కాంగ్రెస్ పార్టీకి పట్టిన గతే ఇప్పుడు మళ్లీ పడుతుందని, ఆనాడు ప్రతిపక్ష హోదా కూడా రాలేదని గుర్తు చేశారు. 'రేవంత్ రెడ్డి పోవాలి.. కేసీఆర్ రావాలి' అనే డిమాండ్ ప్రజల్లో నుంచి వస్తుందని, దీనిని ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు.

## సముద్రంలో సమున్నతంగా..

(మొదటి పేజీ తరువాయి)

అండమాన్‌నికోబార్ పోలీస్, అటవీ శాఖ, భారత నేవీ, తీర గస్తీ దళంతోపాటు పలు డైవింగ్ సెంటర్లకు చెందిన గజ ఈతగాళ్లు జాతీయజెండాను సముద్రజలాల్లోకి మోసుకెళ్లారు. తర్వాత నీటిలోకి తీసుకెళ్లి అడుగున పూర్తిగా పరిచారు. డ్రోన్ల నుంచి చూస్తే సముద్రంలో త్రివర్ణపతాకం నీలిఅలలకు రెపరెపలాడుతూ కన్పించి కనువిందుచేసింది. 200 మందికిపైగా డైవర్లు ఈ రికార్డ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరిలో పాఠశాల విద్యార్థులు ఫతే జహాన్ సింగ్(16), లావణ్య ఇరా(15), రణ్‌విజయ్ సింగ్(14) సైతం పాల్గొనడం విశేషం. ఉదయం 10.35 గంటలకు రికార్డ్ నమోదైనట్లు గిన్నిస్ ప్రపంచ రికార్డ్స్ ప్రతినిధి రిషి నాథ్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అండమాన్‌నికోబార్ లెఫ్టినెంట్ గవర్నర్ డీకే జోషి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చంద్రభూషణ్ కుమార్, డీజీపీ హెచ్ఎస్ ధలివాల, సీనియర్ ఉన్నతాధికారులు హాజరయ్యారు. "భారీ అలల తాకిడిని సైతం తట్టుకుంటూ అంతటి బరువైన జెండాను నడుస్తూ లోపలిదాకా మోసుకుంటూ వెళ్లి ఆక్సిజన్ సిలిండర్ల సాయంతో ఊపిరితీసుకుంటూ జెండా ఆవిష్కరణ జేసి రికార్డ్‌ను నెలకొల్పడం నిజంగా అద్భుతం" అని గవర్నర్ జోషి అభినందించారు. ఇక్కడ పర్యాటకం, సముద్ర కార్యకలాపాలకు ఊపందుకునేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. సముద్రజలాల లోపల త్రివర్ణపతాకాన్ని ఆవిష్కరించడం మాటలకందని మధురానుభూతి అని ఢిల్లీలోని సర్దార్‌పటేల్ విద్యాలయలో పదో తరగతి చదువుతున్న రణ్‌విజయ్ సింగ్ చెప్పాడు. ఉట్టి కొట్టేటప్పుడు నిలబడినట్లుగా.. ఆదివారం సముద్రం అడుగు నుంచి ఒకరిపై మరొకరు నిల్చుని అతిపెద్ద మానవ నిచ్చెనగా ఏర్పడి మరో గిన్నిస్ రికార్డ్‌నెలకొల్పాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. స్వరాజ్ ద?వప్‌లోని లైట్‌హౌస్ డైవ్ సైట్‌లో ఈ రికార్డ్‌కు డైవర్లు సిద్ధమవుతున్నారు.

## మోదీ పర్యటన మోగిపోవాలె!

(మొదటి పేజీ తరువాయి)

ఎరుగని రీతిలో ఘన స్వాగతం పలికేందుకు భారీ ఏర్పాట్లు చేస్తోంది. పర్యటనలో భాగంగా ప్రధాని సుమారు రూ.8 వేల కోట్ల విలువైన ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేయనుండటంతో.. వీటికి భారీగా ప్రచారం కల్పించాలని నిర్ణయించింది. రాష్ట్రం నలుమూలల నుంచి జన సమీకరణ కోసం ప్రత్యేక రైళ్లు, బస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రధాని పర్యటన కోసం ఇప్పటికే అసెంబ్లీ నియోజకవర్గాలు, డివిజన్లవారీగా సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. పరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగసభకు పెద్దఎత్తున ప్రజలను తరలించేందుకు పార్టీ ముఖ్యనాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందుకోసం ఒక్కో జిల్లాకు ఒక సీనియర్ నేతకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు, కేంద్రమంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు ప్రధాని పర్యటన ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రాంచందర్‌రావు బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పగ్గాలు చేపట్టిన తర్వాత మోదీ తొలిసారి రాష్ట్రానికి వస్తుండటంతో.. ఈ పర్యటనను ఆయన ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. నేతలు, కార్యకర్తలను సమాయత్తం చేసే పనిలో బిజీగా ఉన్నారు. మోదీ సభ తెలంగాణలో చరిత్రాత్మకం కాబోతోందని శనివారం ఆయన తెలిపారు. మరోవైపు రాష్ట్రంలో ప్రత్యర్థి పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌లపై విమర్శలకూ పదును పెడుతున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు మహిళలకు, హిందువులకు వ్యతిరేకమంటూ ఈ నెల 4, 6, 8 తేదీల్లో సోషల్‌మీడియాలో విస్తృత ప్రచారం చేయాలని నిర్ణయించినట్లు పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్ తెలిపారు. మోదీ సభకు మల్కాజిగిరి నుంచి కనీసం లక్ష మందిని తరలిస్తామని స్థానిక బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో రూ.3,175 కోట్ల విలువైన జాతీయ రహదారుల విస్తరణ పనులకు ప్రధాని శంకుస్థాపన చేస్తారని బీజేపీ ఎంపీ డీకే అరుణ తెలిపారు.

## బోధనాంశంగా 'మోదీ తత్వం'

(మొదటి పేజీ తరువాయి)

సామాజికవేత్తల జీవితవిశేషాలను విడమర్చి చెప్పబోతున్నామని వర్సిటీలో సోషియాలజీ విభాగ సారథి డాక్టర్ వీరేంద్రసింగ్ వెల్లడించారు. "మీకు నచ్చినా నచ్చకపోయినా ప్రధాని మోదీ రాజకీయ చతురత, నాయకత్వ లక్షణాలను విశదీకరించనున్నాం. మ్యాక్స్ వెబర్, మహాత్మాగాంధీ, లూథర్ కింగ్ వంటి మహానాయకుల నాయకత్వ లక్షణాలతో పాటు ప్రధాని మోదీకి సంబంధించిన పాఠ్యాంశాలను చాన్నాళ్లపాటు బోధించనున్నాం. డిజిటల్ జాతీయవాదం, పౌరసత్వం, వారసత్వం, ప్రపంచీకరణ, ఉద్యమాలను మోదీ కోణంలో చూపిస్తూ మోదీతత్వాన్ని విద్యార్థులకు బోధిస్తాం. పాత పెద్దనోట్ల రద్దు, డిజిటల్ విప్లవం, ఫాస్టాగ్, జల్ శక్తి శాఖ ఏర్పాటు, యూపీఐ వంటి విప్లవాత్మక సంస్కరణలు తేవడం వాటి ద్వారా కోట్లాది మంది ప్రజలు లబి?ధపొందడం, ఆయా పథకాలకు ప్రజల నుంచి వస్తున్న అమితమైన ఆదరణ వంటి అంశాలను బోధిస్తాం. 'సోషియాలజీ ఆఫ్ ప్యాట్రియాటిజం'కోర్సులో నాలుగు పేపర్లు ఉంటాయి. ఒక్కో పేపర్‌ను విద్యాసంవత్సరంలో గరిష్ఠంగా 15 గంటలే బోధిస్తారు"అని ఆయన వెల్లడించారు. దేశంలో ఆర్ఎస్ఎస్ క్షేత్రస్థాయి కార్యకలాపాలు, సమాజంపై దాని ప్రభావాలనూ వివరిస్తామని తెలిపారు. డాక్టర్ వీరేంద్రసింగ్ నీతి ఆయోగ్ లో ప్రజాప్రాజెక్టులను పర్యవేక్షిస్తారు. ఎంఏ విద్యార్థులు గ్రామీణప్రాంతాల్లో చేసిన సర్వేచేశాక వచ్చిన ఫలితాల ఆధారంగా ఇలాంటి వినూత్న పాఠాలను జతచేయాలని నిర్ణయించామని ఆయన తెలిపారు. హిందుస్వరాజ్యం గురించి తొలిసారిగా ప్రబోధించిన ఛత్రపతి శివాజీ మహరాజ్, నాటి బరోడా పాలకుడు మహారాజా సయాజీరావ్ గైక్వాడ్--3ల గురించి సహా ఎంతోమంది సంఘసంస్కర్తల పాఠ్యాంశాలనూ కొత్తగా చేర్చామని ఆయన పేర్కొన్నారు.

# ఆ ముగ్గురు ఎవరు?

(మొదటి పేజీ తరువాయి)

జరగనున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడటంలో నల్లగొండ జిల్లా పాత్ర తీసివేయలేం. మునుగోడు నుంచి విజయం సాధించిన రాజగోపాల్‌రెడ్డి విషయంలో పార్టీ ఇరకాటంలో పడుతోంది. తనకు మంత్రి పదవి ఇస్తామని గతంలో హైకమాండ్ హామీ ఇచ్చిందని ఆయన పదేపదే చెప్తున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా నుండి ఇప్పటికే ఆయన సోదరుడు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రులుగా ఉన్నారు. దీంతో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి ఈసారి కేబినెట్‌లో చోటు దక్కుతుందా లేదా అనేది ఆసక్తి రేపుతోంది. కోమటిరెడ్డి సోదరుల్లో ఒకరికే అవకాశం అనే నిబంధనను అధిష్ఠానం తెరపైకి తెచ్చినట్లు సమాచారం. ఒకవేళ రాజగోపాల్‌రెడ్డికి చోటు కల్పించాల్సి వస్తే, వెంకట్‌రెడ్డిని కేబినెట్ నుంచి తప్పించే అవకాశం ఉంది. పైగా సీఎం రేవంత్ రెడ్డితో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి గ్యాప్ వచ్చినట్లు సమాచారం.

### ఎవరి ప్రయత్నాల్లో వారు..

మంత్రివర్గంలో మార్పులు, చేర్పులు ఉండబోతున్నాయని తెలియగానే పలువురు ఆశావహులు తమతమ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఎవరికి వారు తమ గాడ్ ఫాదర్లను ఆశ్రయించి ఎలాగైనా మంత్రిపదవి దక్కించుకోవాలని గట్టిగా ప్రయత్నిస్తున్నారు. కులాల వారీ సమీకరణలను తెరపైకి తీసుకువస్తున్నారు. ఎస్టీ కోటాలో డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్, దేవరకొండ ఎమ్మెల్యే బాలూ నాయక్ మధ్య పోటీ నెలకొంది. బీసీ కోటాలో మున్నూరుకాపు సామాజిక వర్గం నుండి ఆది శ్రీనివాస్ పేరు వినిపిస్తోంది. ఇక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ కూడా మంత్రివర్గంలో చోటుకోసం ప్రయత్నిస్తున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ సైతం కేబినెట్‌లోకి వెళ్లాలని ఆశిస్తున్నట్టు సమాచారం. మంత్రివర్గ విస్తరణతో పాటు టీపీసీసీలో ఖాళీగా ఉన్న ా్యనిర్వాహక అధ్యక్షుల నియామకంపై కూడా కసరత్తు జరుగుతోంది. ఎస్సీ మాదిగ వర్గం నుంచి సంపత్ కుమార్, ఎస్టీ లంబాడా వర్గం నుంచి బలరాం నాయక్ లేదా బెల్లయ్య నాయక్‌ను కార్యవర్గంలోకి తీసుకునే అవకాశం ఉంది. రెడ్డి సామాజిక వర్గం నుంచి నాయిని రాజేందర్ రెడ్డి లేదా చామల కిరణ్ కుమార్ రెడ్డికి చోటు దక్కవచ్చు. మైనార్టీల నుంచి అజ్మతుల్లా, ఫహీమ్ ఖురేషీ స్థానం ఆశిస్తున్నారు. వీళ్లతో పాటు ప్రచార కమిటీ ఛైర్మన్‌గా మధుయాష్కీని కొనసాగించాలా లేదా అన్నది, కోశాధికారిగా రోహిన్ రెడ్డి నియామకం వంటి అంశాలపై త్వరలోనే స్పష్టత రానుంది. మొత్తానికి జూన్ 2 లోపు జరగబోయే ఈ మార్పులు అటు ప్రభుత్వంలోనూ, ఇటు పార్టీలోనూ కొత్త జోష్ నింపుతాయా లేక అసంతృప్తులకు దారితీస్తాయా అన్నది వేచి చూడాలి.



# 100 రోజులు.. 6 వేల కోట్లు

**ఉద్యోగుల రిటైర్మెంట్ ప్రయోజనాల చెల్లింపులపై సీఎం స్పష్టీకరణ**

- జూన్ 1 కల్లా హెల్త్ కార్డులు
- రెండో పీఆర్సీపై తక్షణమే నివేదిక అందించాలని ఆదేశం
- టీఈజేఏసీ, ఎంప్లాయిస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ప్రతినిధుల సమావేశంలో సీఎం

హైదరాబాద్: రిటైరైన ఉద్యోగుల ఆర్థిక ప్రయోజనాలను రానున్న వందరోజుల్లో కల్పిస్తామని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. దీనికోసం రూ.6వేల కోట్లు చెల్లిస్తామని చెప్పారు. రాష్ట్రంలో కొనసాగుతున్నది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని, ఉద్యోగుల సమస్యలను పరిష్కరించే బాధ్యత ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. శనివారం జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో తెలంగాణ ఉద్యోగ సంఘాల జేఏసీ, తెలంగాణ ఎంప్లాయిస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డితోపాటు టీఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, ఉద్యోగ జేఏసీ చైర్మన్ వి.లచ్చిరెడ్డి, టీఈజేఏసీ నేతలు బి.శ్యామ్, ముజీబ్ హుస్సేన్, జి.సదానందంగౌడ్, చావ రవి, వి.రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉద్యోగుల సమస్యలను జేఏసీ నేతలు ముఖ్యమంత్రి ముందు ప్రస్తావించారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులకు నాలుగు అంశాలపై స్పష్టత ఇచ్చారు. 'వందరోజుల్లో ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.6 వేల కోట్లు చెల్లిస్తాం. రెండో పీఆర్సీపై తక్షణమే నివేదిక ఇవ్వాలని అధికారుల కమిటీని ఆదేశించా. అధికారుల కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా పీఆర్సీపై నిర్ణయం తీసుకుంటాం. జూన్ 1లోగా ఉద్యోగులందరికీ ఆరోగ్య భద్రత కార్డులను అందిస్తాం. ప్రతీ రెండు నెలలకోసారి గుర్తింపు సంఘాలు సమావేశమై సమస్యలపై ప్రభుత్వానికి నివేదిక అందించాలి' అని చెప్పారు.

### ఉద్యోగుల కోసం చేస్తున్నాం...

'ప్రభుత్వం ఏ పథకాన్ని ప్రకటించినా ఉద్యోగులు భుజాన వేసుకుని పనిచేశారు. ఉద్యోగుల సహకారంతోనే ప్రభుత్వ సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేయగలు గుతున్నాం. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల కోసమే మొదటి నిర్ణయం తీసుకున్నాం. ఉద్యోగులకు ప్రతి నెలా మొదటి తారీఖున వేతనాలు అందేలా చర్యలు తీసుకున్నాం. ఉద్యోగ సంఘాలు స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించుకునేలా అవకాశం కల్పించాం. ఉద్యోగుల బదిలీల విషయంలో గందరగోళం తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా నిర్వహించాం. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలను ఎలాంటి వివాదం లేకుండా పూర్తిచేశాం. ఉద్యోగుల ఆరోగ్య భద్రత కార్డుల ప్రతిపాదనపై కూడా ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. రెండేళ్లలో ప్రజా ప్రభుత్వం 67,760 ఉద్యోగ నియామకాలు చేపట్టింది' అని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారు.

### ప్రభుత్వ చిత్తశుద్ధి ఇదీ: ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

'దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల సమస్యలను ప్రజాప్రభుత్వం చాలా వరకు పరిష్కరించింది. రాష్ట్ర ఆవిర్భావం నాటికి ఉద్యోగుల పెండింగ్ బిల్లులు ఉండకుండా చేస్తాం. పదేళ్ల బీఆర్ఎస్ హయాంలో రూ.వేల కోట్ల బిల్లులు చెల్లించకపోవడంతో అవి భారీగా పేరుకుపోయాయి. దీనిపై కసరత్తు చేసి సమస్యలను పరిష్కరిస్తూ ముందుకెళ్తున్నాం. 100 రోజుల్లో రూ.6 వేల కోట్లు పెన్షన్ బకాయిలు క్లియర్ చేయాలని ప్రయత్ని స్తున్నాం. ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఇదీ. ఉద్యోగుల హెల్త్ కార్డులపై ముఖ్య మంత్రి మానవీయ దృక్పథంతో ఆలోచించారు. మీ సమస్యల పరిష్కారం కోసం సీఎం ఒక ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నారు' అని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చెప్పారు.

### సీఎంకు నాయకుల కృతజ్ఞతలు

సీఎం రేవంత్ తీసుకున్న నిర్ణయాల పట్ల టీఈజేఏసీ నేతలు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వం గతంలో చాలావరకు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించిందన్న విషయాన్ని గుర్తు చేశారు. ఈ నెల 5న నిర్వహించనున్న నిరసన కార్యక్రమంతోపాటు అన్ని రకాల నిరసన కార్యక్రమాలను ఉపసంహరించు కుంటున్నట్లు ఉద్యోగ జేఏసీ చైర్మన్ మారం జగదీశ్, టీజీఈజేఏసీ చైర్మన్ లచ్చిరెడ్డి వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

# కాంగ్రెస్‌కు మళ్లీ అధికారం కల్ల

(మొదటి పేజీ తరువాయి)

కమిషన్లు, కాసుల కక్కుర్తి కోసమే చూస్తుంది. మంత్రులే స్వయంగా రంగారెడ్డి జిల్లాలో భూముల ఆక్రమణతోపాటు మైనింగ్ కుంభకోణాలకు పాల్పడుతున్న పరిస్థితి నెలకొంది. అడ్డగోలుగా హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ సబ్బండ వర్గాలను మోసం చేసింది'అని దుయ్యబట్టారు. శనివారం నందినగర్‌లోని తన నివాసంలో ఉమ్మడి రంగారెడ్డిజిల్లా నేతలతో కేటీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలతోపాటు పార్టీని బలోపేతం చేసే దిశగా చేపట్టాల్సిన కార్యాచరణ, రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై పార్టీ నేతలకు కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఎక్కడికక్కడ నిరసనలు: 'ఒకవైపు రాష్ట్రంలో కాంగ్రెస్ ఈ విధంగా ఉంటే, మరోవైపు కేంద్రంలోని బీజేపీ అనేక ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటోంది. వాణిజ్య సిలిండర్ ధరను ఏకంగా రూ.వెయ్యి పెంచింది. అడ్డగోలుగా గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుకుంటూ వస్తున్న బీజేపీ నిర్వాకం వల్ల ప్రజలపై తీవ్ర భారం పడుతోంది. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ అడ్డగోలు నిర్ణయాలపై బీజేపీకి వ్యతిరేకంగా ఎక్కడికక్కడ నిరసన కార్యక్రమాలు చేపట్టాలి. మరోసారి ఈ ధరలు పెంచకుండా ఉండేందుకు ప్రజలను జాగృతం చేయాలి'అని కేటీఆర్ పేర్కొన్నారు.

### మున్సిపల్ ఎన్నికలకు సమాయత్తం

త్వరలో జరగనున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం, తర్వాత జరిగే కమిటీల నిర్మాణంలో చేపట్టాల్సిన కార్యక్రమాలను కేటీఆర్ పార్టీ నేతలకు వివరించారు. 'రాష్ట్రంలో త్వరలో జరగనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో బీఆర్ఎస్ చురుకైన పాత్ర పోషించబోతోంది. కాంగ్రెస్, బీజేపీ చేసే అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సి ఉంది. ప్రతీ ఒక్క యువతీ, యువకుడికి ఓటు హక్కు కల్పించాలి. కాంగ్రెస్ పార్టీ దొంగ ఓట్లు నమోదు చేయకుండా చూడాలి. కాంగ్రెస్, బీజేపీ అధికారాన్ని అడ్డం పెట్టుకొని అడ్డగోలుగా ఓట్లు తొలగించే ప్రమాదం ఉంది. ప్రజల ఓటు హక్కుకు బాధ్యతగా భరోసాగా నిలవాల్సిన అవసరం ఉంది. దీంతోపాటు త్వరలో మున్సిపల్ కార్పొరేషన్లకు ఎన్నికలు జరిగే అవకాశం ఉన్నందున ఆ ఎన్నికలకు సమాయత్తం కావాలి'అని కేటీఆర్ చెప్పారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, మల్లారెడ్డితోపాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

# ఆహారంపైనా యుద్ధమిది..

**ప్రమాదంలో వెయ్యి కోట్ల భోజనాలు**

**ప్రపంచాన్ని అతలాకుతలం చేయనున్న ఎరువుల సంక్షోభం**

హర్మూజ్ జలసంధి మూతపడటంతో చమురే కాకుండా ఎరువుల సరఫరాపైనా పెను ప్రభావం చూపుతోంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే ఎరువుల వ్యాపారంలో (యూరియా, పొటాష్, అమ్మోనియా, ఫాస్ఫేట్) మూడింట ఒక వంతు ఈ మార్గం నుంచే జరుగుతోంది. ఇప్పుడు ఈ మార్గం మూసుకుపోవడంతో రానున్న రోజుల్లో ఆహార ఉత్పత్తి గణనీయంగా పడిపోనుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత ఎరువుల ధరలు 80 శాతం వరకు పెరిగాయి. ప్రస్తుత ఉద్రిక్త పరిస్థితులిలానే కొనసాగితే రానున్న రోజుల్లో ప్రపంచ ఆహార భద్రతకు పెనుముప్పు వాటిల్లే అవకాశాలున్నాయి. తత్ఫలితంగా వారానికి దాదాపు 1000 కోట్ల భోజనాల(మీల్స్)కు ముప్పు తప్పదని, నిరుపేద దేశాలకు ఇది శరాఘాతమేనని ప్రపంచ ప్రఖ్యాత ఎరువుల కంపెనీల అధిపతుల్లో ఒకరైన స్వీన్ టోర్ హాల్‌సెథర్ హెచ్చరిస్తున్నారు. ఎరువుల రవాణాను ఆపేయడమంటే ఒకరకంగా ఆహారంపై యుద్ధం ప్రకటించడమేనని, ధనిక, పేదల మధ్య మరింత అంతరాన్ని పెంచడమేనని 'యారా' ఎరువుల కంపెనీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అయిన స్వీన్ అభిప్రాయపడ్డారు. సంపన్న దేశాల్లోనూ ఆహార ధరలు మండిపోవచ్చునని ఆయన 'బీబీసీ' ఇంటర్వ్యూలో చెప్పారు.

# 'మేం సముద్ర దొంగల్లాంటి వాళ్లం'

**వస్తూవస్తూ క్యూబానూ స్వాధీనం చేసుకుంటామేమో**

**ఇరాన్‌కు డబ్బుకడితే ఊరుకోం**

**అవసరమైతే దాడులకు సిద్ధం: ట్రంప్**

**చర్చలకైనా, యుద్ధానికైనా సిద్ధమే: ఇరాన్**

బీరుట్, వాషింగ్టన్: తాము ఒకరకంగా సముద్రపు దొంగల (పైరేట్స్) లాంటి వాళ్లమేనని, కానీ.. ఆటలు ఆడటం లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. కొన్ని రోజుల క్రితం గల్ఫ్ సముద్ర జలాల్లో ఒక నౌకను అమెరికా నౌకాదళం సీజ్ చేసిన అంశాన్ని ప్రస్తావిస్తూ శుక్రవారం రాత్రి ఫ్లోరిడాలో ఈ వ్యాఖ్య చేశారు. ఈ నౌకలోని సరకును, చమురును తీసుకున్నామని, అదొక లాభదాయక వ్యాపారమని చెప్పారు. "ఇరాన్‌కి నౌకాదళం, వైమానిక దళం, రాడార్ వ్యవస్థలు లేకుండా పోయాయి. నాయకత్వం కూడా బలహీనమైంది. వాళ్లు ఒప్పందం చేసుకోవాలని అనుకుంటున్నారు. మాకు కావాల్సిన స్థాయిలో ప్రతిపాదనలు లేవు. తుది ఒప్పందం సాధ్యమవుతుందా లేదా అన్నది తెలియడం లేదు. ఇరాన్ నాయకత్వంలో అంతర్గత విభేదాలున్నాయి. వాళ్లలో ఉన్న వర్గాలన్నీ ఒప్పందాన్ని కోరుకుంటున్నా, ఏకాభిప్రాయం లేదు. మేం ఇప్పుడు వెనక్కి తగ్గితే మరో మూడు సంవత్సరాల్లో సమస్య మళ్లీ వస్తుంది. అందుకే పూర్తి పరిష్కారం వచ్చే వరకు మేం వెనక్కి వెళ్లం" అని ట్రంప్ తెలిపారు.

### తీవ్ర దాడులకూ సిద్ధం..

అవసరమైతే తీవ్రదాడులకూ సిద్ధంగా ఉన్నామని, సాధ్యమైనంత వరకు చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించాలని ఆశిస్తున్నామని ట్రంప్ తెలిపారు. మానవతా దృష్టితో చూస్తే యుద్ధం వద్దనే అనిపిస్తుందని, యుద్ధం ముగిసిన తర్వాత ఇంధన ధరలు తగ్గే అవకాశం ఉందని చెప్పారు. తమ నౌకాదళం అమెరికాకు తిరిగి వస్తూ క్యూబాను కూడా స్వాధీనం చేసుకుంటుందేమోనని జోక్ చేశారు. ప్రపంచంలోనే అతిపెద్దదైన విమానవాహక నౌక యూఎస్ఎస్ అబ్రహాం లింకన్ సుమారు 100 గజాల దూరంలో ఆగగానే క్యూబా వచ్చి ధన్యవాదాలు చెప్పిమరీ లొంగిపోతుందన్నారు. సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటడానికి నౌకాయాన సంస్థలు ఇరాన్‌కు డబ్బులు చెల్లించినట్లయితే ఊరుకునేది లేదని, వాటిపై తాము ఆంక్షలు విధిస్తామని అమెరికా హెచ్చరించింది. ఈ మేరకు 'అమెరికా విదేశీ ఆస్తుల నియంత్రణ కార్యాలయం' పోస్ట్ చేసింది. ఇప్పటికే హర్మూజ్ చుట్టుపక్కల నిలిచిపోయిన నౌకలపై ఇది మరింత ఒత్తిడి పెంచింది. టోల్‌బూత్ మాదిరి చెల్లింపులు ఆమోదయోగ్యం కాదని స్పష్టంచేసింది.

### హర్మూజ్‌పై నియంత్రణ బలోపేతం: ఇరాన్

పర్షియన్ గల్ఫ్, హర్మూజ్ జలసంధిలోని కీలక సముద్ర మార్గాలపై తమ నియంత్రణను బలోపేతం చేయాలనుకుంటున్నట్లు ఐఆర్‌జీసీ నౌకాదళం తెలిపింది. దాదాపు 2,000 కి.మీ.మేర విస్తరించి ఉన్న ఇరాన్ తీరప్రాంతంపై నియంత్రణ కొనసాగేలా చూస్తామని ప్రకటించింది. మళ్లీ యుద్ధం మొదలయ్యే అవకాశం ఉందని ఇరాన్ సీనియర్ సైనికాధికారి ఒకరు శనివారం తెలిపారు. ఇజ్రాయెల్ తరఫున గూఢచర్యం చేస్తున్నందుకు ఇద్దరు వ్యక్తులకు ఇరాన్ సుప్రీంకోర్టు విధించిన మరణ శిక్షను శనివారం ఉరితీత ద్వారా అమలు పరిచారు.

పశ్చిమాసియాలో ప్రస్తుతం యుద్ధం లేదని, అలాగని శాంతియుత వాతావరణం కూడా లేదని భారత్‌లో ఇరాన్ సర్వోన్నత నేత ప్రతినిధి అబ్దుల్ మజీద్ హకీం ఇలాహి పేర్కొన్నారు. యుద్ధాన్ని నిలపాల్సిన బాధ్యత.. దాన్ని ప్రారంభించిన వారిపైనే ఉంటుందన్నారు. ఆయన శనివారం ఇక్కడ విలేకరులతో మాట్లాడారు.





# అద్భుత ఫలితాలు సాధించి సాయి సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు

**(వినోద్, ప్రజా తీర్పు, దమ్మాయిగూడ మేడ్చల్ జిల్లా) మే 02**

మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడ లోని సాయి సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు ఎస్ఎస్-సీ 2026 తుది పరీక్షల్లో అద్భుత ఫలితాలు సాధించి పాఠశాలకు కీర్తి తీసుకువచ్చారని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండెంట్ సత్య కల్లూరి మాట్లాడుతూ, తమ విద్యార్థులు కష్టపడి చదివి విశిష్ట విజయాలు సాధించారని, వారి విజయ గాథలను ప్రజల ముందుకు తీసుకువస్తే ఇతర విద్యార్థుల్లోనూ ఉన్నత లక్ష్యాలపై ఆసక్తి పెరుగుతుందని తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా సమాజంలో విద్యాపట్ల మరింత చైతన్యం కలుగుతుందని పేర్కొన్నారు. గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు ఇది ఆదర్శంగా నిలుస్తుందని అభిప్రాయపడ్డారు. యువతలో ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు ఉపాధ్యాయులతో పాటు తల్లితండ్రులు తోడ్పడాలని కోరారు..

# జిల్లా ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారమే లక్ష్యం

## నూతన కార్యవర్గం ...

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 2**



జగిత్యాల జిల్లా ప్రభుత్వ వైద్యుల సమస్యల పరిష్కారాన్ని ప్రధాన ధ్యేయంగా పెట్టుకొని నూతన కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలో నిర్వ హించిన సమావేశంలో ప్రభుత్వ వైద్యుల సంఘానికి సంబంధించిన కొత్త కమిటీని సభ్యులు ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలకు పర్యవేక్షణ అధికారిగా వైద్యురాలు అరుణ వ్యవహరించారు. అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో డాక్టర్ అమరేశ్వర్ ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ముస్కు జైపాల్ రెడ్డి, కోశాధికారిగా డాక్టర్ గొడికే నవీన్ ఎన్నికయ్యారు. ఇతర కార్యవర్గ సభ్యులను కూడా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం వైద్యుల సేవా సమస్యలు, సిబ్బంది కొరత, పని ఒత్తిడి, మౌలిక సదుపాయాల లోపం, భద్రతా అంశాలు, ప్రమోషన్లు, వేతనాలకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించేందుకు కృషి చేయనున్నట్లు వెల్లడించింది. సమావేశంలో పలువురు వైద్యులు మాట్లాడుతూ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రులు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. వైద్య సేవల మెరుగుదలకు ముందు వైద్యుల సమస్యల పరిష్కారం అత్యంత కీలకమని అభిప్రాయపడ్డారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ, ప్రభుత్వ వైద్యుల హక్కుల పరిరక్షణతో పాటు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు సమిష్టిగా పనిచేస్తామని తెలిపారు. జిల్లా స్థాయిలో వైద్య రంగానికి సంబంధించిన సమస్యలపై అధికారులతో చర్చలు జరిపి పరిష్కార మార్గాలు అన్వేషించనున్నట్లు పేర్కొన్నారు.



# పార్డి( కే)గ్రామంలో విద్యుత్ షాక్ తో దగ్ధమైన పంటలను పరిశీలించిన ముధోల్ మాజీ శాసనసభ్యులువిఠల్ రెడ్డీ

**(కపిల్ వాగ్మారే సీఆర్ కే, ప్రజా తీర్పు భైంసా) మే 02**

కుబీర్ మండలంలోని పార్డీకే గ్రామంలో సుమారు 26 ఎకరాలలో వేసిన మక్కా పంట దగ్ధశీ కావటం జరిగింది. విషయం తెలుసుకున్న మాజీ శాసనసభ్యులు గడ్డి గారివిట్టల్ రెడ్డి,ఈరోజు వెళ్లి పరిశీలించడం జరిగింది. ఈ విషయాన్ని మన గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారి దృష్టికి మరియు,మన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జ్ మంత్రిగౌరవనీయులు శ్రీ జూపల్లి కృష్ణారావు గారి,దృష్టికిమరియు, వ్యవసాయశాఖ, మంత్రివర్యులు గౌరవనీయులు తుమ్మల నాగేశ్వరరావు గారి దృష్టికి తీసుకువెళ్లి నష్టపరిహారం అందేలా ప్రయత్నం చేస్తానని హామీ ఇవ్వడం జరిగింది. మాజీ శాసనసభ్యులు గారి వెంట మాజీ జడ్పిటిసి శంకర్ చౌవాన్,సర్పంచ్ లు దేవేందర్, మారుతీ మరియు కుబీర్ మాజీ సర్పంచ్ మీరా విజయ్ కుమార్,మాజీ మలేగాం సర్పంచ్ మహిపాల్ రెడ్డి,కుబీర్ విఠలేశ్వరాలయ కమిటీ చైర్మన్ డాక్టర్ పెంటాజీ,మాజీ పిఎసిఎస్ చైర్మన్ దొంతుల రాములు, మాజీ ఎంపీటీసీ బొప్ప నాగలింగం,మల్లేష్ యాదవ్, మార్కెట్ డైరెక్టర్ రాథోడ్ అరుణ్,ఆకుల వెంకటి, మరియు సతం రవికుమార్, విష్ణు, వార్డు మెంబర్లు గంటగజారం, మైస భూమన్న, మైస గంగాధర్, ధనగారి పుండలిక్, సతం విట్టల్, సతం రాములు, లంకరాములు, దొంతులరాకేష్, మరియు మండల సీనియర్ నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# మున్నూరుకాపు సంఘం పట్టణ అధ్యక్షుడి గా రవీందర్

## ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ వెల్లడి

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 2:**



జగిత్యాల పట్టణ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడిగా చిట్ల రవీందర్ ఎన్నికయ్యారు. శనివారం జగిత్యాల జిల్లా సంఘం అధ్యక్షులు చెదలు సత్యానారాయణ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరుగగా ఇందులో చిట్ల రవీందర్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని జిల్లా అధ్యక్షులు తెలిపారు. జగిత్యాల పట్టణంలోని పోచమ్మవాడకు చెందిన రవీందర్ పలు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూనే మున్నూరు కాపు సంఘంలో చురుకుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ మున్నూరుకాపు సంఘం పటిష్టతకు పాటుపడుతానని, అందరి సహాయ సహాకారాలతో సంఘాన్ని ముందుకు తీసుకెళ్తానని తెలిపారు.

# మే 5న ఉద్యోగ ఉపాధ్యాయుల సామూహిక నిరాహార దీక్షలను విజయవంతం చేయండి

- పిఆర్ టీ యూటిఏస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి వి రమణారావు

**(కపిల్ వాగ్మారే సీ ఆర్ కే, ప్రజాతీర్పు భైంసా) మే 02**




టీజిఈజెఏసీ రాష్ట్ర శాఖ,పిలుపుమేరకు ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం దశలవారీగా చేస్తున్న ఉద్యమంలో భాగంగా జిల్లా కేంద్రంలో ఈనెల 5 తలపెట్టిన సామూహిక నిరాహార దీక్షలను విజయవంతం చేయాలని పిఆర్ టి యు టీ ఏస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బివి రమణారావు పిలుపునిచ్చారు. స్థానిక పిఆర్టియు భవన్ లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులు జిల్లా కేంద్రంలో తలపెట్టిన సామూహిక నిరాహార దీక్షలకు అత్యధిక సంఖ్యలో హాజరై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిందిగా కోరారు ప్రభుత్వం వెంటనే స్పందించి ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలను,పరిష్కరించాలని డిమాండ్ చేశారు ముఖ్యంగా ఉద్యోగ ఉపాధ్యాయుల లకు రావలసిన రెండో పి ఆర్ సి ని 51 శాతం ఫిట్మెంట్తో అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు దాదాపు రాష్ట్రంలో ఉద్యోగ ఉపాధ్యాయుల యొక్క 13 వేల కోట్ల పెండింగ్ బిల్లులను రెండు దఫాలలో విడుదల చేయాలని మరియు ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు హెల్త్ కార్డులు అమలు చేయాలని 2024 ఏప్రిల్ నుంచి రిటైర్ అయిన పెన్షనర్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని పెండింగ్ లో ఉన్న ఐదు డిఏలను విడుదల చేయాలని సిపిఎస్ వెంటనే రద్దుపరిచి పాతపెన్షన్ విధానాన్ని అమలుపరుస్తూ సెప్టెంబర్ 1 2004 కంటే ముందు విడుదలైన నోటిఫికేషన్ ద్వారా నియామకం అయిన ఉద్యోగ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించని ఎడల జూన్ 2 తర్వాత ప్రత్యక్ష ఉద్యమ కార్యచరణ చేపడతామని అన్నారు ఈ సమావేశంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సయ్యద్ అన్సర్ జై శివరాం జిల్లా అసోసియేట్ అధ్యక్షురాలు సిహెచ్ వందన, జిల్లా ఉపాధ్యక్షులు ఏ గోపాల్, భైంసా మండల అధ్యక్షులు ఎస్ గంగాధర్ ముధోల్ మండల ప్రధాన కార్యదర్శి అబ్దుల్ అహద్ మండల కార్యవర్గ సభ్యులు బాబురావు లక్ష్మీకాంత్ సిందే భీమ్రావు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



# పది ఫలితాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు సన్మానం

**( ఎలుక భగవాన్ యాదవ్, ప్రజాతీర్పు, ఎండపల్లి)మే 02:**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొండాపూర్ గ్రామంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను గ్రామ సర్పంచ్ తాటిపర్తి రాజవ్వ సూచన మేరకు ఆమె కుమారుడు ఉమ్మడి వెల్గటూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తాటిపర్తి శైలేందర్ రెడ్డి శాలువాతో సత్కరించి అభినందించారు. కొండాపూర్ గ్రామానికి చెందిన దర్శనాల లక్ష్మణ్- విజయ దంపతుల కూతురు దర్శనాల అనుప్రియ ధర్మారం మండల కేంద్రంలోని సాయి మణికంఠ స్కూల్ లో విద్యనభ్యసించి 580 మార్కులు సాధించింది. కొండాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ఎలుక కమల్ యాదవ్ 501 మార్కులు సాధించి గ్రామ ప్రభుత్వ పాఠశాలకే వన్నె తెచ్చాడు. ఈ సందర్భంగా శైలేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఇద్దరు విద్యార్థులు గ్రామానికి గర్వకారణమని, విద్యార్థులంతా వీరి స్ఫూర్తితో ముందుకు సాగి అత్యుత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ ఉపసర్పంచ్ విజయ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మన్నె జితేందర్, వార్డు మెంబర్లు రాం రెడ్డి, రాజు కుమార్,శ్రీనివాస్,హరి ప్రసాద్, వెనెంక మహేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ బోడ శ్రీనివాస్ పాల్గొన్నారు.



# మాసాయిపేట సహకార వ్యవసాయ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆర్డిఓ జయచంద్ర రెడ్డి

**( వంజరపు ఎల్లం ప్రజా తీర్పు ప్రతినిధి మాసాయిపేట్) మే 2**

మెదక్ జిల్లా మాసాయిపేట మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన వ్యవసాయ సహకార సొసైటీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం సాయంత్రం తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి సందర్శించి పలు సూచనలు చేశారు. గన్ని బ్యాగులు, హమాలీలు, లారీలు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని రైతు వద్ద నుండి వచ్చే ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్ మిల్లు పంపాలని రైతు నుండి ప్రతి చివరి గింజ వరకు కొంటామని రైతు దళారులను సంప్రదించవద్దని ప్రభుత్వం మద్దతు ధరతో కొంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ధన్సింగ్, హరీష్, మాజీ పి ఎ సి ఎస్ ఉదరనపుర నర్సింలు సెంటర్ కొనుగోలు కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా కాంగ్రెస్ పార్టీ ఆత్మ డైరెక్టర్ సందీప్ జన్మదిన వేడుకలు

**(కపిల్ వాగ్మారే సీఆర్ కే, ప్రజా తీర్పు భైంసా) మే 02**

నిర్మల్ జిల్లా కుబీర్ మండలం ఆత్మ డైరెక్టర్,దుగ్గిసందీప్ గారికి. కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మాజీ శాసనసభ్యులు, గౌరవనీయులు. బోస్లే నారాయణరావు పటేల్ జన్మదినశుభాకాంక్షలు తెలిపి శాలువాతో,సన్మానించి. మిఠాయిలు అందించారు. నిండు నూరేళ్ళ. పిల్లాపాపలో చల్లగా వర్ధిల్లాలని ఆశీర్వదించారు. మరియు అదేవిధంగా. కుబీర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్నటువంటి. అభివృద్ధి పనులు. ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రయత్నం చేయాలని చెప్పారు. ఈకార్యక్రమంలో,నిర్మల్ జిల్లా జనరల్ సెక్రెటరీ బంక బాబు,శ్యామ్ రావు పటేల్,కుబీర్ మండల అధ్యక్షుడుబషీర్,నిర్మల్ జిల్లాకాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి,చంద్రకాంత్ యాదవ్, తానూర్ మండలకాంగ్రెస్ పార్టీ. అధ్యక్షులు. పుండ్లిక్ పటేల్ నిర్మల్ జిల్లా. ఆత్మ డైరెక్టర్. జాడే శ్రీనివాస్,కస్రాసర్పంచ్ జాదవ్ రాజు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# రైతుముంగిట్లోశాస్త్రవేత్తలు అన్నదాతలకు అవగాహన కార్యక్రమం

**(పొనకంటి ఉపేందర్ రావు ప్రజాతీర్పు టేకులపల్లి )మే 2**



టేకులపల్లి :కృషి విజ్ఞాన కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం వారు టేకులపల్లి మండలం బోడు గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమాన్ని నిర్వహించటం జరిగినది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కృషి విజ్ఞాన కేంద్రం డా. టి. భరత్ పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు పంటలను పండించే క్రమంలో మొత్తాడుకు మించి ఎరువులను వాడకం చెయ్యడం వలన భూసారం తగ్గిపోవడం గమనించటం జరిగినది అని తెలియపరిచారు. అలాగే మార్కెట్ లో డిమాండ్ ఉన్న వరి రకాలను మాత్రమే పండిచాలని తెలియజేశారు. విస్తరణ శాస్త్రవేత్త డా. హేమ శరత్ చంద్ర మాట్లాడుతూ రైతులు కృషి విజ్ఞాన కేంద్రం యొక్క సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలియపరిచారు. ఉద్యాన శాస్త్రవేత్త బి శివ రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అన్నదాతలు అవగాహన కార్యక్రమశీ గురించి వివరించడం జరిగినది. అలాగే ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలోనూ చేయబోతున్నారని వివరించడం జరిగినది అలాగే రైతులు ఒకే రకమైన పంటలను పండిస్తున్నారు. అందువలన ఇది రైతులకు కూడా గిట్టుబాటు కావడం లేదు. కనుక రైతులు పంట మార్పిడి పాటించడం ద్వారా సుస్థిర ఆదాయాన్ని పొందటంతో పాటు నేలతల్లి ఆరోగ్యాన్ని కూడా కాపాడుకోవచ్చని రైతులకు అవగాహన కల్పించబోతున్నారు. అలాగే పంట మార్పిడి విధానాన్ని ప్రోత్సహించడంలో భాగంగా ముఖ్యంగా పందిరిలో కూరగాయల సాగు మరియు ఆయిల్ పామ్ పంట మరియు నీళ్ల సౌకర్యం లేని చోట కుంకుడు పంటను పండిస్తే కనుక తక్కువ పెట్టుబడితో అధిక నికరం ఆదాయం పొందవచ్చని అవగాహన కల్పించచారు. మండల వ్యవసాయ అధికారి అన్నపూర్ణ మాట్లాడుతూ రైతులు అందరు ఫార్మర్స్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరన అధికారి రమేష్ మరియు 60 మంది రైతులు పాల్గొనడం జరిగినది.

# జర్నలిస్టులకు త్వరలో ఇళ్ల స్థలాలు..

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్..
- ఖిలావనపర్తి రథోత్సవంలో పాల్గొన్న మంత్రి..

**(జంగ మహేందర్ యాదవ్, ప్రజాతీర్పు, ధర్మారం) మే 2**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం ఖిలావనపర్తి గ్రామంలో నిర్వహించిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి రథోత్సవంలో మంత్రి లక్ష్మణ్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు అనంతరం మంత్రి మాట్లాడుతూ

రాష్ట్రంలో వివిధ మీడియా సంస్థల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు

ఇటీవల క్యాబినెట్ సమావేశంలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు అంశం చర్చకు వచ్చిందని త్వరలోనే జర్నలిస్టు మిత్రులకు ఇళ్లస్థలాలు అందించడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు ఆలోచన చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కోరిన కోరికలు తీర్చే శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు 2011- 12 లో ఖిలావనపర్తి గ్రామంలో థర్మల్ పవర్ స్టేషన్ సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ప్రయత్నించగా జిల్లా పరిషత్ చైర్మన్ గా తాను అడ్డుకున్నానని మంత్రి తెలిపారు. గ్రామంలో ఒక గజ స్థలం పోకుండా కాపాడానని మంత్రి గుర్తు చేశారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ప్రత్యేక రథం తయారు చేయించాలని ఇందుకు తనవంతుగా సహకరిస్తానని ఈ సందర్భంగా మంత్రి హామీ ఇచ్చారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో డైనింగ్ హాల్ నిర్మాణానికి ఇప్పటికే రూ. 15 లక్షలు నిధులు విడుదల చేశామని మరో రూ. 10 లక్షలు నిధులు విడుదల చేసి డైనింగ్ హాల్ నిర్మాణం పూర్తి చేసే వీ6చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో శ్రీనివాస్ ఎంపీడీఓ వేముల సుమలత ఆలయ కమిటీ చైర్మన్ సంతోష్ ఈవో కాంతారెడ్డి పార్టీ మండల అధ్యక్షుడు తిరుపతి రెడ్డి మాజీ ఎంపీపీ కోడారి అంజన్న ప్రదీప్ రెడ్డి జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు యశోద అజయ్ సాగంటి కొండయ్య వెల్పుల నాగరాజు మొటాపలుకుల అశోక్ జెల్ల సంపత్ రాజేందర్ రెడ్డీ పలగాని రాజుమల్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



# టీబీ ముక్ భారత్ అభియాన్ వైద్య శిబిరం

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 2**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని నెన్నెల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని అవడం ఆరోగ్య ఆయుష్మాను మందిర్ పరిధిలోని కొత్తూరు గ్రామంలోని గ్రామపంచాయతీలో టిబి ముక్త్ భారత్ అభియాన్ వైద్య శిబిరం డిప్యూటీ డి.యం ఇ హెచ్.ఓ మరియు క్షయవ్యాధి నివారణ అధికారి డాక్టర్.సుధాకర్ నాయక్ సమక్షంలో నిర్వహించారు స్తానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డా. లక్ష్మణ్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణ కై అవగాహన కల్పిస్తూ రెండు వారాలకు పైగా దగ్గు లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించాలన్నారు. పోస్టర్లని అవగాహనలో భాగంగా విడుదల చేసి ప్రజల ముందు,ఆవిష్కరించారు. జిల్లాలోని ప్రతి ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిర్ధారణ తెమడ పరీక్షలు, ఎక్స్ రే పరీక్ష ఉచితంగా చేస్తున్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే ఉచితంగా చికిత్స అందిస్తూ, చికిత్స పూర్తయ్యే వరకు ప్రతినెల 1000 చొప్పున పోషణ భత్యాన్ని ప్రభుత్వం అందిస్తుందని ఆయన తెలిపారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి ఈ వ్యాధి తొందరగా వ్యాపిస్తుందని, అందుకు అన్ని రకాల పోషకాహారాలు దొరికే ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమ మార్గం అన్నారు. సత్వరమే వ్యాధి నిర్ధారణ జరిగి చికిత్స ప్రారంభించి వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చు అని తెలిపారు. తుంపర్ల ద్వారా ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాప్తి చెందే ఈ వ్యాధి మద్యం సేవించే వారికి పొగాకు నమిలే వారికి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ శిబిరంలో అవసరం ఉన్నవారికి అన్ని రకాల పరీక్షలు చేశారు. అలాగే తెమడ పరీక్ష కోసం 12 మందికి, ఎక్స్ రే అవసరం ఉన్నవారికి 81మందికి ఇంటికి దగ్గరలోకి పోర్టబుల్ ఎక్స్ రే యంత్రం ద్వారా ఎక్స్ రే తీయడం జరిగింది ఈ శిబిరంలో గ్రామసర్పంచి తలశీడీ రాజేశ్వరి, యం.యల్. హెచ్.పి సౌమ్య,పూజిత,క్షయవ్యాధి సూపర్వైజర్ శ్రీపెల్లి శశికాంత్, హెల్త్ అసిస్టెంట్ రాజ్ కుమార్, ఎక్స్-రె టెక్నీషియన్ పవన్, ఏఎన్ఎం లు బుచ్చమ్మ, అమృత ఆశ కార్యకర్తలు అరుంధతి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.




## మాదకద్రవ్యాలపై దుర్వినియోగంపై విస్తృత అవగాహన కార్యక్రమలు

**(కపిల్ వాగ్మారే సీఆర్ కే, ప్రజా తీర్పు బైంసా) మే 02**

నిర్మల్ జిల్లా బైంసా పట్టణం ఆర్టీసీ డిపో నందు జరిగిన అవగాహన సదస్సు,లో నిషేధ మరియు ఎక్సైజ్ అధికారి,ఎం.ఏ. అబ్దుల్ రజాక్ గారి, ఆదేశాల మేరకు, నిర్మల్, ఖానాపూర్ మరియు బైంసా,ప్రాంతాలలో మాదకద్రవ్యాల దుర్వినియోగ నిరోధక అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించబడ్డాయిఈకార్యక్రమాలలో మాదకద్రవ్యాల వాడకం వల్ల కలిగే దుష్ప్రభావాలపై ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ అవగాహన కార్యక్రమాలలో భాగంగా,మాదకద్రవ్యాలు మరియు సైకోట్రోపిక్ పదార్థాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య,సామాజిక,మరియు ఆర్థిక నష్టాల గురించి ప్రజలకు వివరంగా తెలియజేశారు.సే నో టు డ్రగ్స్" అనే నినాదంతో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ప్రజలు "డ్రగ్స్‌కు నో చెప్పండి,జీవితానికి అవును చెప్పండి" అనే ప్రతిజ్ఞ చేశారు.యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని,తమభవిష్యత్తును నాశనం చేసుకునే అలవాట్లకు లోనుకాకూడదని అధికారులు,సూచించారు. సమాజంలో మాదకద్రవ్యాల వాడకాన్ని అరికట్టడానికి ఇటువంటి,కార్యక్రమాలు,ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి అవగాహన కార్యక్రమాలుకొనసాగుతాయని, అధికారులు,హామీఇచ్చారు ఈ కార్యక్రమాలలో జిల్లా మద్యనిషేధ మరియు ఎక్సైజ్ అధికారి శ్రీ ఎం.ఏ. అబ్దుల్ రజాక్,ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ సీఐ అక్బర్ హుస్సేన్, ఎక్సైజ్ స్టేషన్ నిర్మల్ నుండి సీఐ రంగస్వామి, శ్రీఎస్సై అభిషేకర్, డీటీఎఫ్ టీమ్ నుండి ఎస్సై సింధు, బైంసా నుండి ఎస్సై గజేందర్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.వారి సమన్వయంతో కార్యక్రమాలు విజయవంతంగా జరిగాయి.



## వాటోలిగ్రామంలో విద్యార్థులకు ఘన సన్మానం

**(కపిల్ వాగ్మారే సీఆర్ కే, ప్రజా తీర్పు బైంసా) మే 02**

నిర్మల్ జిల్లా బైంసా మండలం లోని వాటోలి గ్రామంలో విద్యార్థుల ఘన సన్మానం,వాటోలి గ్రామంలో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఘన సన్మాన కార్యక్రమం,నిర్వహించబడింది.ఈకార్యక్రమంలో మొత్తం 22 మంది విద్యార్థిని, విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి గ్రామానికి గర్వకారణంగానిలిచారు.గ్రామ సర్పంచ్ సిహెచ్ సాయినాథ్ గారు, ఉపసర్పంచ్ జంగం ఓం ప్రకాష్ గారు ఆధ్వర్యంలో హనుమాన్ ఆలయం వద్ద ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు, వీడీసీ సభ్యులు మరియు గ్రామ ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొన్నారు.కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను శాలువాలతో సత్కరించి, అభినందన సర్టిఫికెట్లు అందజేశారు.వారి కృషిని గ్రామ పెద్దలు ప్రశంసిస్తూ వారిని అభినందించారు.ఈ సందర్భంగా,డాక్టర్ ఓం ప్రకాష్,మల్లికార్జున,గారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, భవిష్యత్తులో సరైన గ్రూప్ ఎంపిక,కష్టపడి చదవడం, లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం ఎంత ముఖ్యమో వివరించారు. సర్పంచ్ సాయినాథ్ గారు మాట్లాడుతూ, విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తూ,వారికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని మరియు ప్రతి సంవత్సరం ఇలాంటి సన్మాన కార్యక్రమాలు నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలు ఉత్సాహంగా పాల్గొని విద్యార్థులను అభినందించడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. విద్యార్థుల విజయమే గ్రామ అభివృద్ధికి పునాది. అని పేర్కొన్నారు.

## జమ్మికుంట రూరల్ సీఐ పులి వెంకట్‌కు ఘన సన్మానం

**జమ్మికుంట, మే 02 ప్రజాతీర్పు**



హుజూరాబాద్ నుండి బదిలీపై వచ్చి, జమ్మికుంట రూరల్ పోలీస్ స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన పులి వెంకట్ ని శనివారం స్థానిక శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా సీఐని శాలువాతో ఘనంగా సన్మానించి, స్వామి వారి ముత్యాల తలంబ్రాలు మెమెంటోను అందజేశారు. అనంతరం రామారావు మాట్లాడుతూ.. సీఐ వెంకట్ జమ్మికుంటలో శాంతిభద్రతల పరిరక్షణలో విజయవంతం కావాలని కోరుకుంటూ, వారిని దేవస్థాన దర్శనానికి రావాల్సిందిగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తలు పరమేష్, కిరణ్, గోపాల్ రెడ్డి, ఫిషర్మెన్ రాష్ట్ర కార్యదర్శి రాకేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సలీం, యూత్ కాంగ్రెస్ నాయకులు కిరణ్ ఇతర నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జమ్మికుంట నూతన కమిషనర్ బాధ్యతల స్వీకారం

**ముని్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తా..కమిషనర్ మల్లికార్జున స్వామి**

**జమ్మికుంట మే 02 ప్రజాతీర్పు**




రాష్ట్ర ప్రభుత్వం గురువారం విడుదల చేసిన కమిషనర్ ల బదిలలో శనివారం నూతనంగా బదిలీపై వచ్చిన గుట్టల మల్లికార్జున స్వామి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమ్మికుంట మున్సిపాలిటీ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ జి రాజిరెడ్డి, జె.ఏ.ఓ రాజశేఖర్ రెడ్డి, టిపివో శ్రీధర్, టిపిఎస్ రాజ్ కుమార్, టిపిబివో దీపిక, శానిటరీ ఇనస్పెక్టర్ మహేష్, ఆర్ ఐ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వాణి, శ్రీనివాస్ లతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సమాజం,యువత భవిష్యత్తు సురక్షితంగా ఉండాలంటే మాదకద్రవ్యాలకు నో' చెప్పండి

- మాదకద్రవ్యాలపై కఠిన చర్యలకు ప్రజలు,యువత సహకారం అత్యవసరం:
- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా

**(వి.వెంకటేష్,ప్రజా తీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 2**



రామగుండం పోలీస్ కమిషనరేట్, మంచిర్యాల జోన్ పరిధిలోని సీసీసీ నస్పూర్ ఎన్.ఎన్. గార్డెన్‌లో మంచిర్యాల రూరల్ సర్కిల్ పోలీసుల ఆధ్వర్యంలో గంజాయి వినియోగం మరియు దాని దుష్పరిణామాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తుకు తీవ్ర ప్రమాదమని హెచ్చరించారు.ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం,కుటుంబ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.ప్రజలు, యువత,విద్యార్థులు తమతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితులను కూడా మాదకద్రవ్యాల దుష్ప్రభావాల నుండి కాపాడే బాధ్యత తీసుకోవాలని తెలిపారు.డ్రగ్స్ వినియోగం వల్ల వ్యక్తిగత జీవితం మాత్రమే కాకుండా కుటుంబాలు, సమాజం కూడా తీవ్రంగా ప్రభావితమవుతాయని వివరించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన ఎలాంటి సమాచారం ఉన్నా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లేదా రామగుండం పోలీసులకు తెలియజేయాలని కోరారు.అందిన సమాచారం ఆధారంగా వెంటనే చర్యలు తీసుకొని డ్రగ్స్ సరఫరా, వినియోగాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇటీవల మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పోలీస్ సిబ్బంది విస్తృత స్థాయిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా రైల్వే స్టేషన్లు,బస్ స్టేషన్లు మరియు ప్రజలు అధికంగా గుమికూడే ప్రదేశాలను లక్ష్యంగా చేసుకుని ప్రత్యేక డ్రైవ్‌లు చేపడుతున్నారు. గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి నిందితులను పట్టుకుంటున్నారు. అదేవిధంగా మత్తుకు బానిసలైన వ్యక్తులను గుర్తించి వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించి, అవసరమైతే పునరావాస కేంద్రాలకు పంపిస్తున్నారు.ప్రజల సహకారంతోనే మాదకద్రవ్యాల వ్యాప్తిని పూర్తిగా నియంత్రించగలమని, అందరూ అప్రమత్తంగా ఉండి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ కోరారు. ఈ కార్యక్రమంలో జైపూర్ ఏసీపీ ఎన్. వెంకటేశ్వర్లు,జిల్లా వెల్ఫేర్ అధికారి రహూఫ్,మంచిర్యాల రూరల్ సీఐ రవీందర్, వివిధ విభాగాల ఇన్స్పెక్టర్లు, నార్కోటిక్స్ పెద్దపల్లి విభాగం ఇన్స్పెక్టర్ రాజ్ కుమార్, నస్పూర్ ఎస్ఐ ప్రశాంత్,హాజీపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## దళిత రత్న అవార్డు గ్రహీత రత్నం ఐలయ్య ను సన్మానం న్యాయవాదులు

**(వి.వెంకటేష్,ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 2**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో దళిత రత్న అవార్డు గ్రహీత అందుకున్న రత్నం ఐలయ్య ని సన్మానం చేసిన న్యాయవాదులు... ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది చేను రవికుమార్, మాట్లాడుతూ సమాజంలో ఎన్నో సేవ కార్యక్రమాలు చేస్తూ ప్రజలకు ఆదర్శంగా, అందుబాటులో నిలుస్తున్న రత్నం ఐలయ్య కి అవార్డు రావడం గర్వకారణం.అని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు జాడి రాజేష్ మాసు సుధాకర్, దాసరపు రాజు పాల్గొన్నారు..



## ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక సమావేశంలో పాల్గొన్న సబ్ కలెక్టర్ మనోజ్

**(వి.వెంకటేష్, ప్రజాతీర్పు మంచిర్యాల స్టాఫ్ రిపోర్టర్) మే 2**

ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా కన్నల ఆర్,పి, గార్డెన్ లో నిర్వహించిన సమావేశానికి ముఖ్యం అతిధిగా విచ్చేసిన మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, వ్యవసాయ శాఖ వారి స్టాల్ ను సందర్శించారు, ఏఈఓ, ఏవో, లతో నానో యూరియా, నానో డిఏపి,నిలువల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులకు సబ్సిడీ పై వేపనునాను అందించారు. నానో డిఏపి,నానో యూరియా లను ప్రోతహించాలని, రైతులకు క్షేత్ర స్థాయి లో అవగాహనా కార్యక్రమాలు నిర్వాంచాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. రైతులు సాధారణ యూరియా, డి. ఏ. పి ల బదులు నానో యూరియా నానో డి. ఏ. పి లను వాడాలని పిలుపునుచ్చారు. కార్యక్రమం లో ఏడిఏ బెల్లంపల్లి రాజానరేందర్, బెల్లంపల్లి అధికారి ప్రేమ్ కుమార్, కాసిపేట వ్యవసాయ అధికారి ప్రభాకర్, తాండూర్ ఏవో,సుష్మ, కన్నెపల్లి, ఏవో, ప్రశాంత్, వేమనపల్లి ఏవో, వీరన్న, మున్సిపాల్ కమిషనేర్, బెల్లంపల్లి తాసిల్దార్ కృష్ణ, నియోజకవరంగం లోని ఏఈవో,లు, రైతులు పాల్గొన్నారు.



## బాధితునికి 5 లక్షల ప్రొసీడింగ్ చెక్కు అందజేత..

**( గుండేటి రాజు ప్రజాతీర్పు జగిత్యాల స్టాఫ్ రిపోర్టర్ ) మే 2.**

జగిత్యాల మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన పెంట లక్ష్మీ ఇటీవల ప్రమాదవశాత్తూ కరెంటు షాక్ తో మరణించగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన 50 వేల చెక్కును, 4 లక్షల 50 వేల బాండ్ ను వారి కుటుంబ సభ్యులకు జగిత్యాల ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేసిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాజంగి నందయ్య,ఏ డి ఈ జవహర్ నాయక్ సర్పంచ్ లు ప్రకాష్,బొడ్డు దామోదర్,మాజీ ఎంపిటిసి శంకర్,నాయకులు బందేల శేఖర్,లక్ష్మీ రాజం,మాజీ సర్పంచ్ అంకం సతీష్,కోల శ్రీనివాస్,రవీందర్ రావు,సురేందర్ నాయక్, ఏ ఈ లు, తదితరులు పాల్గొన్నారు.



## గ్రామీణ ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి : డా. మహేష్ రెడ్డి

**(దుర్గం నగేష్ , ప్రజాతీర్పు పెద్దపల్లి జిల్లా స్టాపర్), మే 2:**

గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షణ తమ ప్రధాన బాధ్యత అని కరీంనగర్ వన్ హాస్పిటల్ చైర్మన్ డా. మర్రి మహేష్ రెడ్డి పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం పిట్టల ఎల్లయ్యపల్లె గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వన్ హాస్పిటల్ వైద్య బృందం, గ్రామ సర్పంచ్ పిట్టల రవికుమార్, గ్రామ పెద్దల సహకారంతో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా. మహేష్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామాల్లో సరైన వైద్య వసతులు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ప్రజలు ఆరోగ్యంపై అవగాహన పెంచుకుని, ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో అనుభవజ్ఞులైన వైద్యులు జనరల్, స్పెషలిస్ట్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన ప్రాథమిక మందులను ఉచితంగా పంపిణీ చేశారు. అలాగే దైనందిన జీవితంలో పాటించాల్సిన ఆరోగ్య నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత, గాయకుడు పొద్దుపొడుపు శంకర్, సర్పంచ్ రవికుమార్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, వన్ హాస్పిటల్ వైద్య బృందం తదితరులు పాల్గొన్నారు.



## బదిలీపై వెళ్ళిన కమిషనర్ కు వీడ్కోలు..

**జమ్మికుంట మే 02 ప్రజాతీర్పు**

గత రెండు సంవత్సరాలుగా జమ్మికుంట మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపిన మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్ ను మున్సిపల్ అధికారులు, సిబ్బంది శాలువాలతో సత్కరించి, వీడ్కోలు పలికారు. కమిషనర్ మహమ్మద్ అయాజ్ గత రెండు సంవత్సరాల కాలంలో జమ్మికుంట పట్టణాన్ని అన్ని రంగాలలో ముందుంచి జమ్మికుంట పట్టణ పేరును రాష్ట్రంలో పరిచయం చేసిన వ్యక్తి అని మున్సిపల్ అధికారులు కొనియాడారు. పట్టణంలో ఇంటి పన్ను వసూళ్లలో రెండు పర్యాయాలు రాష్ట్ర స్థాయిలో మొదటి వరుసలో నిలిపిన వ్యక్తి అని వారు అన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు శాలువాలతో సత్కరించి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, జె. ఏ. వో రాజశేఖర్ రెడ్డి, టిపివో శ్రీధర్, టిపిఎస్ రాజ్ కుమార్, ఆర్ ఐ భాస్కర్, సీనియర్ అసిస్టెంట్ వాణి, శ్రీనివాస్, షాబీర్ లతో పాటు పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పెద్దమ్మ తల్లి ఆలయానికి ఉప సర్పంచ్ సీసీ కెమెరాలు వితరణ

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట ) మే 02**

రహీమ్ ఖాన్ పేట గ్రామానికి చెందిన ఎర్ర నర్సుపల్లె పెద్దమ్మ గుడి ఆలయానికి ఉప సర్పంచ్ గడ్డమీద పద్మ సుమారు 25వేల రూపాయల సీసీ కెమెరాల సామాగ్రిని ముదిరాజ్ సంఘం సభ్యులకు వితరణ చేయడం జరిగింది, ఈ సందర్భంగా ఉప సర్పంచ్ పద్మ ఆహ్వానం మేరకు స్థానిక ఎస్సై సిరిసిల్ల అశోక్, రూలర్ సీఐ నాగేశ్వరరావులు వచ్చి పెద్దమ్మతల్లి ఆలయంలో సీసీ కెమెరాలు ప్రారంభించారు, ఈ సందర్భంగా రూలర్ సిఐ నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్రామంలోని యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా బాగా చదివి ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడాలని, తల్లితండ్రులు కూడా పిల్లల్ని పరీక్షించాలని తెలిపాడు, ఎస్సై అశోక్ మాట్లాడుతూ ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమని నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర చాలా కీలకమని తెలిపాడు, ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కమటం లావణ్య రాములు, ఉప సర్పంచ్ గడ్డమీది పద్మ, బత్తిని మల్లయ్య, కూస రవి, కంకటి ప్రభాకర్, ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## విజయవంతంగా ముగిసిన సూపర్ సమ్మర్ క్యాంప్

**మంథని, మే 02 (ప్రజాతీర్పు)**

మంథనిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలులో టి-ఫైబర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సూపర్ సమ్మర్ క్యాంప్ శనివారం సర్టిఫికెట్ పంపిణీతో ముగిసింది. ఏప్రిల్ 27న ప్రారంభమైన ఈ క్యాంప్‌లో వారం రోజుల పాటు 70 మంది విద్యార్థులకు రెండు బ్యాచ్ లో శిక్షణ ఇచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వినియోగం, రోబోటిక్స్ తయారీ, ప్రోగ్రామింగ్, సెన్సార్‌ల వినియోగం వంటి అంశాలపై టి-ఫైబర్ ప్రతినిధులు ప్రాక్టికల్ శిక్షణ అందించారు. శిక్షణలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. వేసవి సెలవుల్లో ఇలాంటి శిక్షణ ఏర్పాటు చేయడం పట్ల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుదాడి సుమలత, టి-ఫైబర్ మరియు సూపర్ టీచర్ ప్రతినిధులు రాహుల్, వరుణ్, ధీరజ్, రామస్వామి, రమ్య, ఝాన్సీ, మనోజ్, పాఠశాల ఉపాధ్యాయులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయకుంటే నిరాహార దీక్షకు సిద్ధం

- సుప్రీంకోర్టు ఆదేశాలను గౌరవించాలి
- అంబేద్కర్ జాతీయ అవార్డు గ్రహీత సుంచు మల్లేశం.

**( ఎలుక భగవాన్ యాదవ్,ప్రజాతీర్పు ఎండపల్లి)మే 02:**



విద్యా హక్కు చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని,ఇటీవల భారత సుప్రీంకోర్టు విద్య హక్కుచట్టం(ఆర్ టిఈ యాక్ట్. 2009) అత్యంత కీలకమైన, చారిత్రాత్మక తీర్పును వెలువరించిందని జాతీయ అంబేద్కర్ అవార్డు గ్రహీత సుంచు మల్లేశం పేర్కొన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం సీట్ల కేటాయింపును కఠినంగా అమలు చేయాలని, ఈ చట్టాన్ని జాతీయ మిషన్ గా భావించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసినట్లు మల్లేశం తెలిపారు. 2009 విద్యాహక్కు చట్టం ద్వారా పేద విద్యార్థులకు ప్రతి ప్రైవేటు పాఠశాలలో నూటికి 25% సీట్లను కెటాయించాలనే నిబంధనలు ప్రైవేటు పాఠశాలలు అమలు చేయకపోవడం దారుణమని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీఈ చట్టం కింద ఎంపిక చేసి పంపిన విద్యార్థులకు ప్రవేశం కల్పించడానికి ప్రైవేటు పాఠశాలలు నిరాకరిస్తున్నారని, ఈ విషయమై పలుమార్లు ధర్మారం మండల విద్యాధికారితో మాట్లాడి దరఖాస్తులు సమర్పిస్తే, నిరాకరించారని ఆరోపించారు.ఒక ఆటో డ్రైవర్ బిడ్డ వ్యాపారి, ధనవంతుల బిడ్డలతో సమానంగా పాఠశాలలో ఒకే బెంచీ పై కూర్చోవడం సహజమైన నిర్మాణాత్మకమైన ప్రక్రియ గా మారాలని, ఇది కేవలం ఒక సంక్షేమ పథకం కాదు ఆర్టికల్ 21ఏ,39(ఎఫ్ ) కింద దేశం చిన్నారులకు ఇచ్చిన హక్కు అని కోర్టు పేర్కొం దని వెల్లడించారు.ఇప్పటికైనా ప్రైవేటు పాఠశాలలు సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేస్తూ,ప్రతి ప్రైవేటు పాఠశాలలో నూటికి 25% పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు ముందుకు రావాలని, లేనియెడల విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయని పాఠశాలలపై తగు చర్యలు చేపట్టాలని జూన్ నెలలో తాను నిరాహార దీక్ష సిద్ధమైనట్లు స్పష్టం చేశారు.

# ప్రభుత్వం అందించే ఫలాలు ప్రజలకు మెరుగ్గా అందించటమే "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" ముఖ్య ఉద్దేశ్యం

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి,మే 02 (ప్రజాతీర్పు):**





ఖానాపూర్ పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్ వేదికగా "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" నియోజకవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి, తెలంగాణ గీతాలాపనతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ, ప్రభుత్వం అందించే ఫలాలు ప్రజలకు మెరుగ్గా అందించటమే "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక" ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గస్థాయి సమావేశాలు నిర్వహించినట్లు తెలిపారు. ఇప్పటికే గ్రామీణ పట్టణ ప్రాంతాలలో 99 రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పారిశుధ్యం, పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్, విద్య, వైద్యం, అరైవ్ అలైవ్ వారోత్సవాల కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించమని అన్నారు. వచ్చేవారం రైతు వారోత్సవాలు, తదితర కార్యక్రమాలు ప్రణాళిక అనుగుణంగా నిర్వహిస్తామని చెప్పారు. ప్రభుత్వం పేదల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు అమలుపరుస్తుందని, త్వరలోనే ఇందిరమ్మ జీవిత బీమా, ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్ ఫాస్ట్, తదితర మరిన్ని నూతన పథకాల అమలుకు శ్రీకారం చుట్టబోతుందని పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలందరికీ అందుబాటులోకి తేవాలనే ఉద్దేశంతో, డివిజన్ స్థాయిలలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. దరఖాస్తుల పరిష్కారానికి నిర్దిష్ట గడువు ఉంటుందని చెప్పారు. ఇటీవల వెల్లడైన పదవ తరగతి పరీక్షా ఫలితాలలో నిర్మల్ జిల్లా రాష్ట్రంలోనే ఉత్తమ స్థానంలో నిలిచిందని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని మంచి ఫలితాలు సాధిస్తామని తెలిపారు.

### ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుంది. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ప్రభుత్వం ప్రజలతో మమేకం అయ్యేందుకు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అనే 99 రోజుల ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమాన్ని అమలుపరుస్తుందని వివరించారు. ప్రభుత్వము అమలు పరుస్తున్న పథకాల వల్ల ఖానాపూర్ నియోజకవర్గ ప్రజలు ఎంతో లబ్ధి పొందుతున్నారని చెప్పారు. ఖానాపూర్ నియోజకవర్గానికి 6 వేల 155 ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని అన్నారు. 53 వేల కుటుంబాలకు 200 యూనిట్ల సబ్సిడీ విద్యుత్ అందుతుందని వివరించారు. కొత్త రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రైతు రుణమాఫీ తదితర ఎన్నో పథకాల ద్వారా పేదల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ప్రభుత్వం గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలు మొదలుకొని యూనివర్సిటీల వరకు విద్యాభివృద్ధికి చొరవ చూపుతోందని చెప్పారు. ఖానాపూర్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అధికారుల తోడ్పాటు అవసరం అన్నారు. ఇటీవలి వివిధ ప్రమాదాల వల్ల పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇటీవల విడుదలైన పదవ తరగతి పరీక్ష ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించిన ప్రభుత్వ విద్యాసంస్థలకు చెందిన పలువురు విద్యార్థులను ఎమ్మెల్యే, కలెక్టర్, అధికారులు అభినందించారు. శాలువాలతో సన్మానించారు. మహిళా సంఘాలకు మంజూరైన పలు చెక్కులను పంపిణీ చేశారు. దివ్యాంగులకు మంజూరైన 95 వేల రూపాయల విలువగల స్కూటీలు, ల్యాప్ టాప్ లు పూర్తి సబ్సిడీతో అందించారు. అనంతరం వివిధ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకళ్యాణి, సిపిఓ జీవరత్నం, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, మున్సిపల్ చైర్మన్ అంకం మౌనిక, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ లు పడిగెల భూషణ్, లక్ష్మీనారాయణ, ఇతర అధికారులు, సిబ్బంది, ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## అన్నదాతకు 'కోత' కష్టం

**(దుర్గం నగేష్ ప్రజాతీర్పు పెద్దపల్లి జిల్లా స్టాఫర్), మే 2:**

పండించిన పంట చేతికొచ్చే దశలో రైతన్నకు ఇబ్బందులు మొదలయ్యాయి. పెద్దపల్లి జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ఏర్పడిన అవ్యవస్థ రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. కొనుగోలు కేంద్రాల వద్ద ఇప్పటికే ధాన్యం రాశులు పేరుకుపోవడంతో, మరో నాలుగు రోజుల పాటు వరి కోతలు నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించడం వివాదాస్పదంగా మారింది.

జిల్లాలోని పీపీసీ కేంద్రాలు ధాన్యంతో నిండిపోయాయి. మిల్లులకు తరలింపు ప్రక్రియ మందగించడం వల్ల కొత్తగా వచ్చే ధాన్యానికి స్థలం లేకుండా పోతోంది. లారీల కొరత, హమాలీల లేమి కారణంగా కొనుగోళ్లు నిలిచిపోవడం రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోంది. ఈ పరిస్థితుల్లో కోతలు ఆపమని అధికారుల ఆదేశాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. పొలాల్లో కోతకు సిద్ధంగా ఉన్న వరి వర్షాలకు గురైతే నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. మరోవైపు ఇప్పటికే హార్వెస్టర్లకు అడ్వాన్సులు చెల్లించిన రైతులు, కోతలు నిలిపివేయాలన్న నిర్ణయంతో ఆర్థికంగా నష్టపోతున్నారు. ముందస్తు ప్రణాళిక లోపం కారణంగా గన్నీ బ్యాగులు, రవాణా సౌకర్యాలు సమకూర్చడంలో యంత్రాంగం విఫలమైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టోకెన్ల పంపిణీలో స్పష్టత లేకపోవడం, మిల్లుల వద్ద అన్‌లోడింగ్ ఆలస్యం కావడం రైతుల సమస్యలను మరింత పెంచుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యానికి రైతులు బలి కావద్దని, వెంటనే ధాన్యం తరలింపును వేగవంతం చేసి కొనుగోళ్లను సజావుగా నిర్వహించాలని జిల్లా రైతులు డిమాండ్ చేస్తున్నారు. కోతలకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




## సూక్ష్మ రుణాలు మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదం చేయాలి : గిరి దేశపాక

**గోదావరిఖని, మే 2,( ప్రజాతీర్పు):**

పెద్దపల్లి జిల్లా రామగుండం కార్పొరేషన్ పరిధిలోని గోదావరిఖని పట్టణం లెనిన్ నగర్ భగత్ సింగ్ సర్కిల్‌లో ఫ్రీచార్జ్ బిజ్ యాక్సిస్ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఫ్రీచార్జ్ బిజ్ యాక్సిస్ బ్యాంక్ జోనల్ మేనేజర్ గిరి దేశపాక మాట్లాడుతూ, సూక్ష్మ రుణాలు పేద, మధ్యతరగతి మహిళల ఆర్థిక స్వావలంబనకు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మహిళలు చిన్న వ్యాపారాలు, స్వయం ఉపాధి కార్యక్రమాలు ప్రారంభించి అభివృద్ధి చెందేందుకు ఈ రుణాలు ఉపకరిస్తాయని పేర్కొన్నారు. అందుబాటులో ఉన్న ఈ అవకాశాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మొదటి టౌన్ సబ్‌ఇన్స్పెక్టర్ కె. మనోహర్, 9వ డివిజన్ కార్పొరేటర్ యుగేందర్ మాట్లాడుతూ, సామాజిక సేవలో భాగంగా ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. పట్టణ ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ శిబిరంలో బ్యాంకు సిబ్బంది రవి, చంద్రమౌళి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో స్థానికులు హాజరై వైద్య సేవలు పొందడంతో శిబిరం విజయవంతమైంది.

## ముందస్తుగా నైరుతి పవనాలు.. త్వరగా నిష్క్రమణపై చెప్పలేమన్న ఐఎండీ

ఎండలతో అల్లాడుతున్న పౌరులకు భారత వాతావరణ శాఖ చల్లటి కబురు చెప్పింది. సాధారణంగా వచ్చే దానికన్నా ముందే ఈ సంవత్సరం నైరుతి రుతుపవనాలు భారత్‌ను పలకరిస్తాయని తెలిపింది. ఈ నెల 14-16 తేదీల మధ్య నైరుతి రుతు పవనాలు అండమాన్ వచ్చే సూచనలున్నాయని వెల్లడించింది. పలు రీజియన్లలో సాధారణం కంటే అధిక స్థాయిలో వేడి గాలుల దినాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, దేశంలోని మరికొన్ని చోట్ల ఈ నెలలో సాధారణ స్థాయి కంటే ఎక్కువగా వర్షపాతం నమోదవుతుందని వెల్లడించింది.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇల్లందు నియోకవర్గం స్థాయి సమావేశం

- సమావేశానికి ఎమ్మెల్యే కోరం కనకయ్య స్పెషల్‌ఆఫీసర్. జిల్లా. డి ఆర్ డి .ఏ విధ్యాచందన

**(పొనకంటి ఉపేందర్ రావు, ప్రజాతీర్పు టేకులపల్లి) మే 2**



ఇల్లందు :వ్యవసాయ సంబంధిత, పోస్టర్లను ఎమ్మెల్యేఅవిష్కరణ అంగనవాడీ టిచర్లకు స్మార్ట్ ఫోన్లు పంపిణి చేసి, స్వయం సహాయక సంఘాల,వ్యవసాయ శాఖ అధ్వర్యంలో ఏర్పాటచేసిన స్టాల్స్ ను ఎమ్మెల్యే పరిశీలన41 గ్రూప్ ల మహిళ స్వయం సహాయక సంఘాల సభ్యులకు 3కోట్ల26లక్షలరూపాయల చెక్కులు ఎమ్మెల్యే పంపిణి.పేద ప్రజల అభ్యున్నతి కోసం పనిచెసే ఏకైక ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం-ఎమ్మెల్యే కనకయ్య మన నియోజకవర్గంలో ప్రజా ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న సంక్షేమ పధకాల కోసంవందలకోట్లు ఖర్చుచేస్తున్నాం.. పేదలందరికి సన్నబియ్యం, ఉచితవిధ్యుత్, మహిళలం దరికి ఉచిత బస్సు, స్వయం సహయక సంఘాలకు వడ్డీ లేని ఋణాలు,రేషన్ కార్డులు ముఖ్య మంత్రి రేవంత్రెడ్డి నాయకత్వంలో పంపిణిచేస్తున్నాం. పేదల సోంత ఇంటి కలను ఇందిరమ్మ ఇళ్ళు పేరిట ప్రజా ప్రభుత్వంలో మంత్రి పొంగులేటి శ్రీనన్న నేతృత్వంలో వారి సోంత ఇంటి కల నిరవేరుస్తున్నాంప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే ఉద్ధేశంతో సిసిరోడ్లు, బిటి రోడ్లు మంజూరు చేస్తున్నాంప్రజా ప్రభుత్వంలో విధ్య,వైద్యానికి పెద్దపీట వేస్తూ ఇల్లందులో 100 పడకల ఆసుపత్రి నిర్మిస్తున్నాం, ఇంటి గ్రెటేడ స్కూల్నిర్మాణం చెవట్టబోతున్నాం. నియోజకవర్గంలో ఆరోగ్యం బాగోలేని వారికి సి. ఎం.రిలీఫ్ ఫండ్,పెదింటి ఆడ బిడ్ల పెళ్ళికి కళ్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులు పంపిణి చేస్తున్నాం.అంగన్ వాడీ వ్వవస్ధ పారదర్శకంగా ఉండాలని మంత్రి సీతక్క నెతృత్వంలో స్మార్ట్ ఫోన్లు పంపిణి చేస్తున్నాంఇల్లందు నియోజకవర్గం 80%వ్యవసాయ ఆధారిత ప్రాంతం రైతులందరు సేంద్రియా వ్యవసాయం పై దృష్టి సారించాలి, అయిల్ పామ్ వ్యవసాయం పై అధికారులు రైతులకు అవగాహన కల్పించాలిపేద ప్రజల కోసం ప్రజా ప్రభుత్వం చేస్తున్న ఖర్చు, ఇస్తున్న సంక్షేమ పధకాలు ప్రజా ప్రతినిధులు ప్రతి గడపకు చెరువేయాలి, చేస్తున్న మేలు తెలియపర్చాలి.తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఇల్లందు మండలం బొజ్జాయిగూడెం గ్రామ పంచాయితిపరిధిలోని జూా గార్డెన్స్ లో నిర్వహించిన ఇల్లందు నియోజకవర్గం స్థాయి సమావేశానికి ముఖ్య అతిధిగహజరై నియోజకవర్గంలో అమలవుతున్న సంక్షేమ పధకాలుప్రభుత్వం చేస్తున్న ఖర్చు పై అధికారుల సంక్లుప్త వివరణఅనంతరం ప్రజా ప్రభుత్వం లక్షాలనుఉద్ధేశించి ప్రసంగించి,మహిళ స్వయం సహయక సంఘాల అధ్వర్యంలో ఏర్పాటుచేసినస్టాల్స్ నుపరిశీలించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య ఈ సమావేశంలోప్రొగ్రామ్ స్పేషల్ ఆఫీసర్, డి ర్ డి ఏ విధ్యా చందన ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు ఇల్లందు మున్సిపాలిటి చైర్మెన్, వైస్ చైర్మెన్ దొడ్డా కిరణ్ మిత్ర డానియేల్ పెండేల రాజు ఆత్మకమిటి చైర్మెన్ మంగిలాల్నాయక్5మండలాలఎం ర్ ఓ లు ఎం పి డి ఓ లు వ్యవసాయ శాఖ అధికారులు, విధ్యుత్ అధికారులు, ×జణూ సూపర్వైజర్లు, భవననిర్మాణఅధికారులు,విధ్యాశాఖ అధికారులు పలు సంబంధిత శాఖ అధికారులు, నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నేతలు తదితరులు పాల్గోన్నారు

# మల్రెడ్డిపల్లి ప్రాజెక్ట్ పనులను జిల్లా కలెక్టర్ తో కలిసి, క్షేత్రస్థాయిలో... పరిశీలించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**(కవ్వాల సురేందర్ ప్రజాతీర్పు, వేములవాడ), మే 02 :**






మల్రెడ్డిపల్లి ప్రాజెక్ట్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. శనివారం రోజున వేములవాడ రూరల్ మండలం, మల్రెడ్డిపల్లి గ్రామంలో నిర్మాణంలో ఉన్న మల్రెడ్డిపల్లి ప్రాజెక్ట్‌ను రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ,జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ , నీటిపారుదల శాఖ అధికారులతో కలిసి, క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించి, పనుల్లో నాణ్యతతో పాటు వేగం కూడా పెంచాలని అధికారులకు మరియు సంబంధిత కాంట్రాక్టర్‌కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిర్దేశిత గడువులో పనులు పూర్తి చేసి, రైతులకు త్వరితగతిన సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ ద్వారా ఈ ప్రాంతానికి సాగునీరు అందించేందుకు ఆనాడు 1737 కోట్లతో... శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు కు అంకురార్పణ చేశారని అన్నారు.ఆ ప్రాజెక్ట్ ద్వారా అందుతున్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకునేలా అనుసంధాన ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడం జరుగుతోందన్నారు. మల్రెడ్డిపల్లి ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాత కుడి, ఎడమ కాల్వల ద్వారా సుమారు 3,600 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మల్లారం, నాగయ్యపల్లి, పోచెట్టిపల్లి, కొనయపల్లి, కాశయ్యపల్లి, ఎదురు గట్ల, చెక్కపల్లి, అచ్చన్నపేట, వెంకటంపల్లి, బాలరాజపల్లి తదితర గ్రామాలకు ప్రత్యక్ష, పరోక్ష లాభాలు చేకూరుతాయని తెలిపారు.భూసేకరణకు సంబంధించిన రైతులకు ఇవ్వాల్సిన నష్టపరిహారం నిధులు సిద్ధంగా ఉన్నాయని, వాటిని త్వరగా పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్‌కు సూచించినట్లు తెలిపారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలోని ప్రాజెక్టు నిర్మాణం కోసం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు విప్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో... సాగునీటి రంగానికి ప్రాధాన్యత ఇస్తూ,ప్రతి ఎకరానికి నీరు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని స్పష్టం చేశారు. నంది మేడారం పంపుల ద్వారా నీటి సరఫరాను మరింత మెరుగు పరచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. కలిగోట సూరమ్మ ప్రాజెక్ట్, లచ్చపేట రిజర్వాయర్, ఎర్రచెరువు, పటేల్ చెరువుల అభివృద్ధి పనులను కూడా వేగవంతం చేసి, రైతులకు నీరు అందించే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.మల్రెడ్డిపల్లిలో రైతు వేదిక, గోదాముల నిర్మాణానికి భూమి కేటాయించి, నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడం, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడం ప్రభుత్వ ధ్యేయమని అన్నారు.కాంట్రాక్టర్లు నాణ్యతతో కూడిన పనులు వేగంగా పూర్తి చేయాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజలు సహకరించాలని విప్ కోరారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ అధికారులు, రెవెన్యూ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




# మత్తు పదార్థాలకు యువత బానిసై భవిష్యత్తు అంధకారం చేసుకోవద్దు

## మంత్రి పొన్నం ప్రభాకర్

**హుస్నాబాద్ మే 02 ప్రజా తీర్పు**

మత్తు పదార్థాలకు బానిసై యువత తమ భవిష్యత్తును అంధకారం చేసుకోవద్దని మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 27 నుండి మే 2వ తేదీ వరకు బాలల భద్రత, రక్షణ మరియు మాదకద్రవ్యాలకు వ్యతిరేక సంక్షేమ వారంలో భాగంగా మిషన్ వాత్సల్య పథకం - జిల్లా బాలల పరిరక్షణ విభాగం, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు.కాగా ఈ కార్యక్రమం హుస్నాబాద్ లోని లక్ష్మీ గార్డెన్ ఫంక్షన్ హాల్ లో నియోజకవర్గస్థాయి సమావేశంలో మాదకద్రవ్యాల వినియోగం అరికట్టడం, మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన కల్పించడం మరియు పిల్లలు, యువతలో మాదకద్రవ్యాల వాడకాన్ని నివారించడం పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత మత్తు పదార్థాలకు బానిసలుగా మారి భవిష్యత్తు అంధకారం చేసుకోవద్దని సూచించారు. మత్తు పదార్థాల వినియోగం ద్వారా యువత భవిష్యత్తు ప్రమాదంలో ఉందని, ఈ ప్రమాద బారిన పడకుండా అందరూ అప్రమత్తంగా ఉండాలని, కేవలం క్షణికానందం కోసం మత్తు పదార్థాలను సేవించడం ద్వారా భవిష్యత్తు లక్ష్యాలను, తల్లిదండ్రుల కలలను చేరుకోలేరన్నారు. వీటి వినియోగం ద్వారా ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి అన్నారు. యువత, పిల్లలు గ్రహించాలని మీతోటి వారు ఎవరైనా మత్తు పదార్థాలు సేవిస్తున్నట్లయితే వాటి ద్వారా కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా గంజాయి లాంటి మత్తుపదార్థాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపిస్తుందని, ఇందులో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో గంజాయి నియంత్రణకై డ్రగ్స్ కంట్రోల్ విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలు సేవిస్తున్న, రవాణా విక్రయాలకు పాల్పడుతున్న వారిని పట్టుకోవడమే ఈ విభాగం ప్రత్యేకత అని తెలిపారు. ఎవరైనా మత్తుపదార్థాలు సేవించినా అమ్మినా డయల్ 100 కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాదకద్రవ్యాల నివారణకు సంబంధించిన గోడపత్రికలను సంబంధిత అధికారులతో కలిసి మంత్రి విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పాలనాధికారి కే. హైమావతి, పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ , హుస్నాబాద్ పురపాలక సంఘం చైర్మన్ దండి లక్ష్మి ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, మరియు పాలకవర్గం, జిల్లా సంక్షేమ అధికారి శారద, వివిధ జిల్లా శాఖ అధికారులు,బాల రక్షా భవన్ కోఆర్డినేటర్ మమత, జిల్లా బాలల పరిరక్షణ అధికారి రాము, చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు, చైల్డ్ లైన్ అధికారులు పాల్గొన్నారు.



# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కింద నిర్వహిస్తున్న 99 రోజుల ప్రత్యేక కార్యక్రమం :

**(అరికిల్ల జయకుమార్, ప్రజా తీర్పు మంచిర్యాల్ మండల్) ఏప్రిల్ 2**

మహిళా, శిశు, దివ్యాంగులు మరియు వృద్ధుల సంక్షేమ శాఖ (ఔజణడూజ), మంచిర్యాల ఆధ్వర్యంలో లి"డ్రగ్ అవగాహన కార్యక్రమం ను నస్పూర్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం పిల్లలు మరియు యువతలో మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించడం, పాఠశాల స్థాయిలో ముందస్తు గుర్తింపు, కౌన్సెలింగ్ మరియు రిఫరల్ సేవలను అందించడం, అలాగే పాఠశాలల సమీపంలో డ్రగ్ సరఫరాను నియంత్రించడం. ఈ కార్యక్రమానికి రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,( ఏసీపీ) జైపూర్ , జిల్లా సంక్షేమ అధికారి, మంచిర్యాల, సంబంధిత సీఐ, ఎస్ఐలు, ప్రొటెక్షన్ ఆఫీసర్ సత్తయ్య , చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ ప్రేమ్ కుమార్ , పాఠశాల నిర్వహణ, మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ విద్యార్థులతో నేరుగా మాట్లాడి, మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. అలాగే డ్రగ్ అవగాహన పోస్టర్లను ప్రారంభించి, డ్రగ్ వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, చట్టపరమైన పరిణామాలు మరియు సామాజిక ప్రభావాలపై వివరించారు. విద్యార్థులకు ప్రమాదకర ప్రవర్తనలను గుర్తించడం, అవసరమైనప్పుడు సహాయం పొందడం, మరియు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాల్సిన అవసరంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలు, తల్లిదండ్రులు మరియు సమాజం పాత్ర ఎంతో ముఖ్యమని తెలియజేశారు.

# ఆలయ బావిలో నీటి సమస్యకు పరిష్కారం

## సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామి

**రామగిరి, మే 02 (ప్రజాతీర్పు)**




రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలోని శ్రీ సీతారామ భక్త ఆంజనేయస్వామి ఆలయంలో ఉన్న బావిలో ప్రతి వేసవిలో నీటి నిల్వ లేకపోవడం వల్ల భక్తులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను హనుమాన్ భక్తులు సర్పంచ్ రేండ్ల శారద కుమారస్వామికి తెలియజేశారు. సమస్యపై వెంటనే స్పందించిన సర్పంచ్ ఆలయం బయట ఉన్న హ్యాండ్ బోర్‌ను మరమ్మతు చేయించి తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చారు. దీంతో ఆలయానికి వచ్చే భక్తులతో పాటు గ్రామం మీదుగా వెళ్లే బాటసారులు, వాహనదారులకు కూడా తాగునీటి సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. ఈ సేవా కార్యక్రమంపై హనుమాన్ మాల ధరించిన భక్తులు హర్షం వ్యక్తం చేస్తూ సర్పంచ్‌ను అభినందించారు.



# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు రైతులలో అవగాహన

**(వేణు, ప్రజాతీర్పు రాజన్న సిరిసిల్ల ) మే 02**

రామన్నపేట గ్రామంలో బోయిన్పల్లి మండలం రాజన్న సిరిసిల్ల జిల్లా రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు అనే కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ అధికారులు సంయుక్తంగా వానాకాలంలో చేసే సాగు పంటల పై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ సురేష్ ప్రొఫెసర్ జిల్లెల్ల అగ్రి యూనివర్సిటీ మాట్లాడుతూ వరి, పత్తి యూనివర్సిటీ మరియు ఏవో ప్రణీత మేడం గారు ఏఈఓ శ్రీదేవి గారు సర్పంచ్ కవిత వెంకటరెడ్డి గారు ఉప సర్పంచ్ మిట్టపల్లి శ్రీనివాస్ రెడ్డి గారు వార్డు మెంబర్స్ మరియు రైతులు మొక్కజొన్న పంటలలో యూరియా వాడకం తగ్గించాలని సూచించారు. యూరియా వాడకాన్ని తగ్గించుకోవడానికి రైతులు తమ పొలంలో జనుము మరియు జీలుగ వంటి పచ్చిరొట్ట ఎరువులను, జీవన ఎరువులను, సేంద్రీయ ఎరువులు వాడటం ద్వారా అవి పంట దిగుబడిని పెంచడమే కాకుండా భూమిని కూడా సారవంతం చేస్తాయని చెప్పారు. సాధారణంగా తెలంగాణలో వరి పంట 50 శాతానికి పైగా ఉండటం వలన ఇది భూమి సారవంతంని దెబ్బతీస్తుంది కాబట్టి రైతులు వరి పంటలకు బదులుగా పప్పు ధాన్యాలు వంటి పెసర, మినుమ, బొబ్బర్లు మరియు నూనె గింజలు వంటి కుసుమ, ప్రొద్దుతిరుగుడు, ఆముదము, ఆవాలు సోయాబీన్ వంటి పంటల వైపు వెళ్లాలని సూచించారు, ఇది రైతులకు లాభాన్ని ఇవ్వడమే కాకుండా భూమి ఆరోగ్యాన్ని కూడా కాపాడుతుందని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసిన సన్న రకం వరి రకాలు కూనారం వరి 2, తెలంగాణ సోనా, సిద్ధి మరియు సాంబ మసూరి పంట రకాలను సాగు చేయాలని సూచించారు. రసాయనాలను అధిక మొత్తంలో వాడకుండా అవసరమైన మేరకే వినియోగించాలని, సమగ్ర సస్యరక్షణ పద్ధతులను పాటించాలని తద్వారా పెట్టుబడి ఖర్చులను తగ్గించుకోవాలని రైతులకు చెప్పారు. నీటి వినియోగం ఆరుతాడి మరియు డ్రిప్ ఇరిగేషన్ పద్ధతుల ద్వారా తగ్గించుకోవాలని తద్వారా వాతావరణ కాలుష్యాన్ని తగ్గించుకోవచ్చని చెప్పారు. మండల వ్యవసాయ అధికారి ఏవో ప్రణీత గారు మాట్లాడుతూ శాస్త్రవేత్తలు చెప్పిన పద్ధతులను రైతులు వానకాలంలో అవలంబించి సాగు ఖర్చులని తగ్గించుకుంటూ లాభాలను పొందాలని చెప్పారు. వ్యవసాయ శాఖ వారు ఆయిల్ పామ్ సాగునుప్రోత్సహించడానికి డ్రిప్ ఇరిగేషన్ కు సబ్సిడీ అందిస్తున్నారని తెలియజేశారు. వ్యవసాయ విస్తరణ అధికారిని మాట్లాడుతూ రైతులు వచ్చే వాన కాలంలో రాష్ట్ర ప్రభుత్వము సిఫార్సు చేసిన సన్నరకం వడ్లను పండించి లాభాలు పొందవచ్చును అని చెప్పారు అదేవిధంగా ఎటువంటి సన్న రకాలను వాడుకోవాలో రైతులకు సిఫార్సు చేశారు. ఈ కార్యక్రమం గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు



# 2027 జనగణన ఎన్యూమరేటర్లకు శిక్షణ

**హుస్నాబాద్ చిగురుమామిడి మే 02 (ప్రజా తీర్పు)**

2027 జనగణన మొదటి దశ హౌస్ లిస్టింగ్ జనగణన మూడు రోజుల శిక్షణ కార్యక్రమం చిగురుమామిడి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తహశీల్దార్ ఎం రమేష్ పేర్కొన్నారు.ఈ శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎన్యుమరేటర్స్, సూపర్వైజర్ లకు మండల ఇంచార్జీ అధికారిగా వ్యవహరిస్తున్న తహశీల్దార్ ఎం రమేష్ వారికి పలు సూచనలు చేశారు.జిల్లా అదనపు సెన్సెస్ అధికారి వి కిషన్ రావు,జిల్లా సెన్సెస్ కోజిఆర్డినేటర్ తిరుపతిలు పాల్గొని సూపర్వైజర్లు,ఎన్యుమరేటర్స్ కి సెన్సెస్ ప్రక్రియలో ఎదురయ్యే సమస్యలను వాటిని పరిష్కరించే విధానాలని కూలకషంగా విపులంగా వివరించారు.ఈ శిక్షణ కార్యక్రమంలో ఫీల్డ్ ట్రైనర్లు జి చంద్రశేఖర్,టి భూపతి,ఎంఫిఎస్ఓ మహేందర్,ఎన్యూమరేటర్లు,సూపర్వైజర్లు పాల్గొన్నారు.



# పది ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించిన మంత్రి అడ్లూరి

**( ఎలుక భగవాన్ యాదవ్ , ప్రజాతీర్పు, ఎండపల్లి)మే 02:**

ధర్మపురి నియోజకవర్గ స్థాయి "ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక" సమీక్షా సమావేశంలో జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం లోని జడ్పీహెచ్ఎస్ పాతగూడూర్ పాఠశాల విద్యార్థులు 2026 పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించిన విద్యార్థులు టి.సహర్షిత, సిహెచ్.సంజన, వై. రేఖ లను రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్, జిల్లా విద్యాశాఖాధికారి రాము లు అభినందించారు. అలాగే పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చి, మిగతా వారిలో స్ఫూర్తిని నింపారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సముద్రాల హరికృష్ణ, గ్రామ సర్పంచ్ కొంగల జగదీశ్వర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాధారాణి, ఎం.సత్తయ్య, పాఠశాల ఉపాధ్యాయ బృందంపాల్గొన్నారు.

# పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాల అమలు

- ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వ సాయం కొండంత అండ
- కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు

**(భూక్య సందీప్, భద్రాద్రి కొత్తగూడెం, ప్రజాతీర్పు, రిపోర్టర్) మే 02**



పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు నిరుపేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం చుంచుపల్లి మండలంలోని కమ్మ సత్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని నియోజకవర్గ పరిధిలోని లబ్ధిదారులకు సుమారు రూ. 6.22 కోట్ల విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆడబిడ్డల పెళ్లిళ్లకు ప్రభుత్వ సాయం కొండంత అండగా నిలుస్తోందని, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద 86 మందికి రూ. 86.09 లక్షల విలువైన చెక్కులను అందజేశామని తెలిపారు. స్వయం సహాయక సంఘాల రుణాలతోనే మహిళా సాధికారత సాధ్యమవుతుందని ఆకాంక్షిస్తూ, గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా 49 సంఘాలకు రూ. 5.25 కోట్ల రుణాలను పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. నిరుపేదల ఆరోగ్య భద్రతకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక గొప్ప భరోసా అని, నియోజకవర్గంలోని 72 మంది బాధితులకు రూ. 35 లక్షల విలువైన వైద్య సహాయం మంజూరైందని వివరించారు. ప్రతి గడపకూ ప్రభుత్వ ఫలాలు అందడమే నిజమైన అభివృద్ధి అని, అర్హులైన ఏ ఒక్కరూ నష్టపోకుండా పథకాలు అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా నిధులను మంజూరు చేస్తోందని, లబ్ధిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని ఆయన పిలుపునిచ్చారు. నియోజకవర్గంలోని ప్రతి పేదవాడి కష్టంలో పాలుపంచుకుంటూ అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ మధు కమిషనర్ సుజాత సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, మండల ఎమ్మార్వో పుల్లయ్య, ఎంపీడీవో సుభాషిణి, ఎమ్మార్వో నాగరాజు, ఎక్సైజ్ సీఐ జయశ్రీ కార్పొరేటర్లు, సర్పంచులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో పెరుగుతున్న కాలుష్యం

- వరి కొయ్యాల దగ్ధంతో తగ్గుతున్న భూసారం
- వ్యవసాయ శాఖ హెచ్చరికలు పట్టించుకోని రైతులు

**(వెగ్గళం రాధాకిషన్ ప్రజాతీర్పు ఇల్లంతకుంట ) మే 2**



ఇల్లంతకుంట మండలంలో పలుగ్రామాల్లో రైతులు వరికోతలు అయి పోవడంతోనే పశు గ్రాసం ఎక్కడి కక్కడే అలాగే వదిలి వేసి పశు గ్రాసం తీయకుండానే అలాగే వరి కొయ్యలకు నిప్పు పెట్టడం తో భూమిలో ఉన్న భూసారం పోతుందని వ్యవసాయ శాఖ పదేపదే హెచ్చరికలు జారీ చేస్తున్న వారి మాటలు లెక్కచేయకుండా కొయ్యలను తగలబెడుతున్న రైతులు వ్యవసాయ శాఖ ఎలా స్పందిస్తుందో చూడాలి

# సెన్సస్ 2027కు సమన్వయంతో ముందుకు సాగాలి: కలెక్టర్ కోయ శ్రీ హర్ష





(దుర్గం నగేష్, ప్రజా తీర్పు,పెద్దపల్లి జిల్లా స్టాపర్), మే 2:

సెన్సస్ 2027 ప్రక్రియను విజయవంతం చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) జె. అరుణ శ్రీ, డీసీపీ రామ్‌రెడ్డి పాల్గొన్నారు. జనగణన చట్టబద్ధ ప్రక్రియ అని, ప్రతి ఒక్కరూ తమ వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. 1881 నుంచి ప్రతి 10 ఏళ్లకు ఒకసారి నిర్వహించే జనగణన కోవిడ్ కారణంగా ఆలస్యమైందని, ఇప్పుడు 16వ జనగణన చేపడుతున్నామని తెలిపారు. జనగణనను రెండు దశల్లో నిర్వహిస్తామని చెప్పారు. మే 11 నుంచి జూన్ 9 వరకు హౌస్ లిస్టింగ్ చేపట్టి ఇళ్లకు సంబంధించిన 33 అంశాలపై వివరాలు సేకరిస్తారని పేర్కొన్నారు. జిల్లాలో 1548 హౌస్ లిస్టింగ్ బ్లాకులు ఉండగా, ప్రతి బ్లాక్‌లో సుమారు 300 ఇళ్లు, 800 మంది జనాభా ఉంటుందని వివరించారు. రెండో దశగా 2027 ఫిబ్రవరి-మార్చిలో జనాభా గణన జరుగుతుందని తెలిపారు. మొత్తం ప్రక్రియ డిజిటల్ విధానంలో జరుగుతుందని, డేటా గోప్యతకు పూర్తి భద్రత ఉంటుందని చెప్పారు. ఏప్రిల్ 26 నుంచి మే 10 వరకు స్వీయ గణనకు అవకాశం కల్పించామని, సంబంధిత వెబ్‌సైట్‌లో కుటుంబ సభ్యులు వివరాలు నమోదు చేసుకోవచ్చని సూచించారు. నమోదు అనంతరం వచ్చే 11 అంకెల నంబర్‌ను ఎన్యుమరేటర్‌కు ఇవ్వాలని తెలిపారు. స్వీయ గణనపై స్పందన తక్కువగా ఉందని, సుమారు 10 వేల మంది ఉద్యోగులు ఉన్నప్పటికీ కేవలం 1500 నమోదులు మాత్రమే జరగడం ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయం, ఉద్యోగులు తక్షణమే స్వీయ గణన పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్‌టీపీసీ, కేశోరం, ఆర్‌ఎఫ్‌సీఎల్, సింగరేణి సంస్థల్లో 100 శాతం నమోదు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. గ్రామాలు, వార్డుల స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి గ్రామం, ప్రతి వార్డులో కనీసం 100 కుటుంబాలు స్వీయ గణన చేయించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. రేషన్ డీలర్లు, స్వయం సహాయక సంఘాలు, రైతు వేదికలు, పోలీస్ సిబ్బంది ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించాలని తెలిపారు. వచ్చే నాలుగు పని దినాల్లో 50 వేల స్వీయ గణన నమోదు సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఈ సమావేశంలో ఆర్డీఓలు సురేష్, బి. గంగయ్య పాల్గొన్నారు.



## రాజన్న సిరిసిల్లలో కాంగ్రెస్ మైనార్టీ సెల్ కీలక సమావేశం

(నారు కట్ల మధు, ప్రజాతీర్పు, రాజన్న సిరిసిల్ల) మే 02

కేంద్రంలో ఈ రోజు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ముఖ్య నాయకుల సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి హైదరాబాద్‌కు చెందిన మైనార్టీ సీనియర్ నాయకుడు, ఏఐసీసీ సభ్యుడు మరియు సిరిసిల్ల అబ్జర్వర్ మొహమ్మద్ ఫయాజ్ హాజరై నాయకులకు మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ, జిల్లాలో పార్టీ బలోపేతానికి మైనార్టీ వర్గాల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు సాహెబ్ హుసేన్ మాట్లాడుతూ, మైనార్టీ వర్గాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో మైనార్టీ జిల్లా కార్యదర్శి అబ్దుల్ రజాక్ సహా ఇతర నాయకులు పాల్గొని పార్టీ అభివృద్ధి, సభ్యత్వ విస్తరణ, రాబోయే కార్యక్రమాలపై చర్చించారు. నాయకులు పార్టీ శక్తివంతం కోసం సమిష్టిగా పనిచేయాలని నిర్ణయించారు.



## రామగుండంలో 'దోస్త్' షార్ట్ ఫిలిం షూటింగ్

గోదావరిఖని , మే 2,(ప్రజా తీర్పు)

యువతలో విలువలను పెంపొందించే లక్ష్యంతో రూపొందుతున్న 'దోస్త్' షార్ట్ ఫిలిం చిత్రీకరణ రామగుండం నగరంలో వేగంగా కొనసాగుతోంది. పల్లవి చరణం మీడియా క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మితమవుతున్న ఈ చిత్రానికి సంబంధించిన రెండో షెడ్యూల్ షూటింగ్ శనివారం ఘనంగా ప్రారంభమైంది. దర్శకుడు మోదుంపల్లి రామస్వామి ఆధ్వర్యంలో ఈ షెడ్యూల్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. సహజత్వాన్ని ప్రతిబింబించేలా ప్రతి సన్నివేశాన్ని బృందం నిష్ఠగా తెరకెక్కిస్తున్నట్లు సమాచారం. ఈ సందర్భంగా దర్శకుడు రామస్వామి మాట్లాడుతూ, నిజమైన స్నేహం అంటే ఏమిటి, నిజమైన స్నేహితుడు ఎవరు అనే అంశాలపై ఈ చిత్రం కేంద్రీకృతమైందన్నారు. భావోద్వేగాలకు దగ్గరగా, యువతను ఆలోచింపజేసే కథాంశంతో 'దోస్త్' రూపొందుతోందని తెలిపారు. ప్రస్తుత సమాజంలో మారుతున్న సంబంధాల మధ్య స్నేహానికి ఉన్న విలువను గుర్తు చేయడమే చిత్ర లక్ష్యమని పేర్కొన్నారు. త్వరలోనే చిత్రీకరణను పూర్తి చేసి, ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు చిత్రబృందం వెల్లడించింది. ఇప్పటికే ఈ చిత్రంపై ఆసక్తి నెలకొనగా, యువతకు సందేశాత్మకంగా నిలిచే చిత్రంగా 'దోస్త్' నిలుస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ చిత్రంలో లక్ష్మి, భూమయ్య, బాయ్ శ్రీనివాస్, గొల్లపల్లి రామలింగం, కంది నాగరాజు, వెంకటేష్, దుప్పటి సారయ్య, బోసాల అంజయ్య, రాజేశ్వరి, శ్రీలత నేత, సుమలత, సర్వర్ విన్ను, దుగ్గు, రిషి, రాకేష్, రాయి, వేణుగోపాల్ నటిస్తున్నారు. కెమెరామెన్ గొల్లపల్లి పవన్ తన చిత్రకళతో సన్నివేశాలకు జీవం పోస్తున్నారు. చిత్రబృందం సమన్వయంతో పనిచేస్తూ ప్రాజెక్ట్‌ను ముందుకు తీసుకెళ్తోంది.




## వాహన చోరీ కేసులో నిందితుడి రిమాండ్

(కవ్వాల సురేందర్, ప్రజా తీర్పు, వేములవాడ) మే 2 :

వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కోడిముంజ గ్రామంలో ఇటీవల జరిగిన వాహన చోరీ కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి, అతని వద్ద నుండి 3 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే, వేములవాడ ప్రాంతంలో జరుగుతున్న వాహన చోరీలపై ప్రత్యేక దృష్టి సారించిన పోలీసులు గస్తీ మరియు తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, అతను వాహన చోరీలకు పాల్పడినట్టు ఒప్పుకున్నాడు. దామ పవన్ అలియాస్ పవన్ కళ్యాణ్, నివాసం: గోదావరిఖని కి చెందిన నిందితుడి వద్ద నుండి మొత్తం 3 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. అనంతరం నిందితుడిని కోర్టులో హాజరుపరచగా, న్యాయస్థానం అతనిని రిమాండ్‌కు తరలించింది. ఈ కేసు విచారణలో ప్రతిభ కనబరిచిన ఎస్ఐ రామ్మోహన్, పీసీ తిరుపతి, పీసీ ఇమ్రాన్‌లను సీఐ వీర ప్రసాద్ గారు అభినందించారు. వేములవాడ టౌన్ పోలీసులు ప్రజలు తమ వాహనాలను సురక్షిత ప్రదేశాల్లో నిల్వ ఉంచాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.




## ఆల్‌టైమ్ హైకి జీఎస్టీ వసూళ్లు

వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు గత నెలలో ఆల్‌టైమ్ హై రికార్డును నెలకొల్పాయి. మునుపెన్నడూ లేనివిధంగా ఏప్రిల్‌లో రూ.2.43 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. దీంతో నిరుడు ఏప్రిల్‌లో నమోదైన రూ.2.23 లక్షల కోట్ల రికార్డు చెరిగిపోయింది. దిగుమతుల నుంచి వచ్చే పన్ను వసూళ్లు ఏకంగా 25.8 శాతం పుంజుకొని రూ.57,580 కోట్లకు చేరడమే ఇందుకు కారణమని శుక్రవారం కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. ఇదిలావుంటే తెలంగాణలోనూ రికార్డు స్థాయిలో వసూళ్లు జరిగాయి. రూ.4,621 కోట్లు వచ్చాయి. గత ఏడాది ఏప్రిల్‌లో రూ.3,433 కోట్లుగానే ఉన్నాయి.

## దేశీయ వాహన విక్రయాలు భళా

గత నెల ఏప్రిల్‌లో వాహన విక్రయాలు పెద్ద ఎత్తున జరిగాయి. ప్యాసింజర్ వెహికిల్స్ సేల్స్ 4.5 లక్షలుగా ఉన్నట్టు అంచనా. మారుతీ సుజుకీ, హ్యుందాయ్, కియా తదితర కంపెనీల కార్లకు భారీగా డిమాండ్ కనిపించింది. మారుతీ దేశీయ విక్రయాలు మునుపెన్నడూ లేనివిధంగా 1,91,122 యూనిట్లుగా ఉన్నాయి. దీంతో నిరుడు డిసెంబర్‌లో నమోదైన 1,82,165 యూనిట్ల రికార్డు కనుమరుగైంది. ఆల్టో, ఎస్-ప్రెస్సో, సెలెరియో, వాగనార్ మాడళ్లకు ఆదరణ దక్కింది. ద్విచక్ర వాహన విభాగంలో హీరో, హోండా, సుజుకీ తదితర వాహనాల సేల్స్ బాగా పెరిగాయి.




## వారంలో పెట్రో బాంబ్.. పెట్రోల్, డీజిల్‌పై రూ.5 పెంపు!

పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ ధరలు పెంచబోమంటూ ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రజలకు హామీలు గుప్పించిన కేంద్ర ప్రభుత్వం.. ఎన్నికలు ముగిసిన వెంటనే యూటర్న్ తీసుకుంది. ముందుగా వాణిజ్య సిలిండర్ ధరను అమాంతం రూ. 933 పెంచేసి ప్రజలకు షాక్ ఇచ్చింది. ఈ ధరల పెంపు ఇంతటితో ఆగేలా లేదు. పెట్రోల్, డీజిల్ ధరలు మరో వారం రోజుల్లోపల పెరిగే అవకాశం ఉందని ఉన్నత ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. పెట్రోల్ ,డీజిల్ ధరలు లీటరుకు రూ. 4-5 పెరగవచ్చని వారు చెప్పారు. గృహ వినియోగ 14.2 కిలోల ఎల్‌పీజీ సిలిండర్ ధర రూ. 40-50 పెరగవచ్చని తెలిపారు. ఎన్నికల్లో రాజకీయ లబ్ధి పొందేందుకు ధరలు పెంచబోమంటూ బుకాయించిన కేంద్ర సర్కార్.. ఎన్నికలు ముగిసిన రెండు రోజులకే ప్లేటు ఫిరాయించడంపై నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వ రంగ చమురు సంస్థలు అంతర్జాతీయ ధరలకు అనుగుణంగా వాణిజ్య ఎల్‌పీజీ, పారిశ్రామిక డీజిల్, 5 కేజీల ఎల్‌పీజీ, అంతర్జాతీయ విమానయాన సంస్థలకు విక్రయించే జెట్ ఫ్యూయల్ ధరలను శుక్రవారం పెంచాయి. ఏప్రిల్ 29న పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలను లీటరుకు రూ. 25-28 వరకు పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు అంచనా వేశారు. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడి చేయడం, దానికి ప్రతిగా ఇరాన్ జరిపిన భారీ ప్రతీకార చర్యల ఫలితంగా అంతర్జాతీయ చమురు ధరలు ఒక్కసారిగా పెరిగాయి.

# పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

(భూక్య సందీప్, భద్రాద్రి కొత్తగూడెం, ప్రజాతీర్పు, రిపోర్టర్) మే 02



రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం నియోజకవర్గంలోని దుమ్ముగూడెం మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరేలా రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు.ముందుగా దుమ్ముగూడెం మండలం బండిరేవు గ్రామంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన, సమగ్ర విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నదన్నారు. యంగ్ ఇండియా పథకం కింద నిర్మించనున్న ఈ రెసిడెన్షియల్ పాఠశాల ద్వారా విద్యార్థులకు విద్యతో పాటు వసతి, పోషకాహారం, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి వంటి అన్ని సౌకర్యాలు ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆధునిక తరగతి గదులు, సైన్స్ కంప్యూటర్ ల్యాబ్‌లు, గ్రంథాలయం, క్రీడా మైదానాలు, హాస్టల్ వసతులతో ఈ విద్యాసంస్థ నిర్మించబడుతుందని పేర్కొన్నారు. ఈ పాఠశాల నిర్మాణం పూర్తయిన అనంతరం స్థానికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వచ్చి వారి భవిష్యత్తుకు బలమైన పునాది ఏర్పడుతుందని తెలిపారు.అనంతరం దుమ్ముగూడెం మండలంలోని చింతగుప్ప గ్రామం నుండి బురదమడుగు వరకు బీటీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సదుపాయాలను విస్తృతంగా అభివృద్ధి చేయడం ద్వారా గ్రామాల మధ్య అనుసంధానాన్ని బలోపేతం చేయడమే కాకుండా ప్రజల రాకపోకలకు సౌలభ్యం కల్పించడం ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఈ రహదారి పూర్తయిన తర్వాత చింతగుప్ప, బురదమడుగు గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు గణనీయమైన ఉపయోగం ఉంటుందని పేర్కొన్నారు.ములకపాడు గ్రామంలోని మినీ స్టేడియంలో 400 మీటర్ల అథ్లెటిక్ ట్రాక్‌తో కూడిన మినీ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి మంత్రి శంకుస్థాపన చేశారు. గ్రామీణ యువతలో క్రీడా చైతన్యాన్ని పెంపొందించేందుకు ప్రభుత్వం క్రీడా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మినీ ఇండోర్ స్టేడియంలో కల్పించిన సదుపాయాలను జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన బ్యాడ్మింటన్ కోర్టులో మంత్రి, కలెక్టర్ కలిసి షటిల్ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ప్రతి అర్హులైన కుటుంబానికి సంక్షేమ పథకాల లబ్ధి అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మారుమూల గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు కూడా అభివృద్ధి ఫలాలు చేరేలా ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా పేదలకు గృహ సౌకర్యాలు కల్పిస్తూ వారి జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని, మొదటి విడత విజయవంతంగా పూర్తయిందని, రెండో విడతను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. రైతుల సంక్షేమంపై మాట్లాడుతూ ధాన్యం మొక్కజొన్న కొనుగోళ్లను పారదర్శకంగా నిర్వహిస్తూ వారం రోజుల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామని తెలిపారు. రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.ప్రభుత్వం గ్రామీణాభివృద్ధిని సమగ్రంగా ముందుకు తీసుకెళ్లే దిశగా రహదారులు, విద్య, ఆరోగ్యం, క్రీడా రంగాలకు సమాన ప్రాధాన్యతనిస్తూ చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను దశల వారీగా అందిస్తూ సమగ్ర అభివృద్ధి సాధనలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ దుమ్ముగూడెం మండలంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తాయని తెలిపారు. యంగ్ ఇండియా పాఠశాల, రహదారి, క్రీడా వసతుల అభివృద్ధి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో విద్య, రవాణా, క్రీడా రంగాల్లో పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు నిజంగా పేదల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని తెలిపారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం ద్వారా జిల్లాలో విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. ఈ పాఠశాలలో సుమారు 2,000 నుండి 2,500 మంది విద్యార్థులు ఒకేచోట విద్యనభ్యసించే అవకాశం కల్పించబడుతుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ జిల్లాలో వేగవంతంగా కొనసాగుతోందని, రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోళ్లు జరిపేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వివిధ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాలలో ఎస్‌పి రోహిత్ రాజు, ఐటీడీఏ పీవో రాహుల్, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణల్ శ్రేష్ఠ సంబంధిత శాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

